కేసరిపై ఈశ్వరా..!



సింహ వాహనంపై మూలస్థానేశ్వరుడు

నెల్లూరులోని మూలస్థానేశ్వరస్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం రాత్రి స్వామివారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల హర నామస్మర ణతో నగరోత్సవం సాగింది. ఉదయం ధ్వజారోహ ణను అర్చక బృందం శాస్త్రోక్తంగా నిర్వహిం చింది. బ్రహ్మోత్సవాలకు సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ నంది పటం ధ్వజాన్ని అధిరోహించింది. ఈ సందర్భంగా సంతానం లేని మహిళలకు కోడిముద్దలు పంచిపెట్టారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

ఆలయాల ఆదాయాన్ని బట్టి కేటగిరీల మార్పు

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల ఆదాయ వనరులను బట్టి కేటగిరిలను మారుస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త జీవో ప్రకారం 6సీ కేటరిగి ఆలయాలకు ఆదాయం రూ.2లక్షల నుంచి రూ.15లక్షలకు పెంచింది. 6బీ ఆలయాల ఆదాయం రూ.15లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచింది. అలాగే రూ.50 లక్షల నుంచి రూ.2కోట్లకు పెంచింది. ఈ జీవో కారణంగా నెల్లూరు నగరంలోని సర్వోదయ కళాశాల(ఆలయ ట్రస్టు పరిధిలోనిది కాబట్టి) 6ఏ కేటగిరి నుంచి 6బీ కేటగిరికి చేరింది. అలాగే గతంలో జిల్లాలో 36 ఆలయాలు 6బీలో ఉండగా, కొత్త జీవోతో 33 ఆలయాలు 6సీ కేటగిరిలో చేరాయి. ఈవోల పర్యవేక్షణలో ఉండే ఆలయాల కేటగిరిలు మాత్రం యథాతథంగా ఉన్నాయి.

మదనపల్లె టమోటా సింహపురిలో..

● పది టన్నుల దిగుమతి ● రైతుబజార్లలో విక్రయాలు ● రేపటి నుంచి కాయగూరలు కూడా..




నవాబుపేట రైతుబజారులో టమోటా విక్రయాన్ని పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత కుమారి



నెల్లూరు (వ్యవసాయం), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : టమోటా ధర పడిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్న కర్షకులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఉత్పత్తి అవుతున్న టమోటాలను జిల్లా అవసరాలకు శనివారం 10 టన్నులు దిగుమతి చేసుకుని జిల్లాలోని రైతుబజార్లలో విక్రయిస్తున్నారు. నగరంలోని రైతుబజార్లను మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత కుమారి పర్యవేక్షించి, మాట్లాడారు. టమోటా ధరలు బాగా పడిపోయిన నేపథ్యంలో రైతులకు కనీసం పెట్టుబడి దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. దళారులు కూడా వినియోగదారులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని దీన్ని నివారించేందుకు రైతు వద్దే నేరుగా కొనుగోలు చేసి రైతుబజార్లలో అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. రైతులు కూడా వారు పండించిన కూరగాయలను నేరుగా రైతుబజార్లలో అమ్ముకునే అవకాశం ఉందని చెప్పారు. అలా కాని పక్షంలో మార్కెటింగ్ శాఖ రైతుల నుంచి కూరగాయలను సేకరించి రైతుబజార్లలో ఆరోజు మార్కెట్ ధరకు విక్రయించడం జరుగుతుందన్నారు. శనివారం నెల్లూరులోని పత్తేఖాన్ పేట, నవాబుపేట, పొదలకూరు, కందుకూరు, కావలి రైతుబజార్లలో కిలో 13-15 చొప్పున టమోటాలు విక్రయించారు. సోమవారం నుంచి స్థానిక రైతులు పండిస్తున్న కాయగూరలను కూడా రైతుబజార్లలో విక్రయించనున్నట్లు చెప్పారు.

నేడు సీఎం పర్యటన : పటిష్ట బందోబస్తు



నెల్లూరు (హరనాథపురం/క్రైం), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం నెల్లూరుకు రానున్నారు. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు, బందోబస్తు ఏర్పాటు చేసింది. విజయవాడ నుంచి విమానంలో బయలుదేరి ఉదయం 10.55 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. 11.10 గంటలకు రేణిగుంటలో ఉన్న ఆర్వీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఓ వివాహానికి హాజరవుతారు. 11.45 గంటలకు తిరుపతి ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 12.10గంటలకు నెల్లూరులోని కనుపర్తిపాడు జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి గొలగమూడి రోడ్డులో ఉన్న వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర కుమారుడి వివాహ వేడుకలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. తిరిగి 12.55 గంటలకు వీపీఆర్ కన్వెన్షన్ నుంచి బయలుదేరి హెలికాప్టర్ ద్వారా తిరుపతి విమానాశ్రయానికి వెళతారు.

● 902 మందితో బందోబస్తు

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా 902 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తును ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ ఒకరు, డీఎస్పీలు ఏడుగురు, సీఐలు 26 మంది, ఎస్‌ఐలు 60, ఏఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుళ్లు 169, కానిస్టేబుళ్లు 266, మహిళా ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు 79, హోమ్‌గార్డులు 120 మంది, స్పెషల్ పార్టీ సిబ్బంది 54, ఏఆర్ సిబ్బంది 120 మొత్తం 902 మందితో బందోబస్తు విధుల్లో ఉంటారు. వీపీఆర్ కన్వెన్షన్ హాలులో శనివారం పోలీసు అధికారులు, సిబ్బందికి పూర్తిస్థాయి బందోబస్తును మ్యాప్ ద్వారా ఎస్పీ క్షుణ్ణంగా వివరిస్తూ బ్రీఫింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎవరికీ ఇబ్బంది లేకుండా సున్నితంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. అప్రమత్తంగా ఉంటూ ట్రాఫిక్ సమస్య లేకుండా పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే వాహనాలు నిలుపుకునేలా చూడాలన్నారు. అనంతరం కాన్వాయి ట్రయల్ రన్ నిర్వహించారు. బ్రీఫింగ్‌లో అదనపు ఎస్పీ (ఏఆర్) మునిరాజ, ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ క్రిష్ణారావు, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వీఎస్‌యూ అభివృద్ధికి కృషి చేస్తా

● నూతన వీసీ అల్లం శ్రీనివాసరావు

వెంకటాచలం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ) అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నూతన వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో శనివారం కుటుంబ సభ్యులు, గురువుల సమక్షంలో వీసీగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో వీఎస్‌యూ ప్రధాన భూమిక వహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరిచేలా అత్యుత్తమ విద్యను అందించేందుకు వర్సిటీ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. పరిశోధనలకు ప్రాధాన్యత ఇస్తూ సమాజానికి ఉపయోగపడే విధంగా భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. వీఎస్‌యూ అభివృద్ధికి అందరి సహకారం అవసరమన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుకు వర్సిటీ రిజిస్ట్రార్ సునీత, ప్రొఫెసర్లు తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అల్లం శ్రీనివాసరావు గొలగమూడి భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమంతోపాటు కాకుటూరు సమీపంలో ఉన్న అడవిలోని శివాలయాన్ని దర్శించుకున్నారు.



వీసీ అల్లం శ్రీనివాసరావుతో రిజిస్ట్రార్ సునీత, ప్రొఫెసర్లు

సంగం : కొరిమెర్ల రోడ్డులోని రైస్‌మిల్లులో బియ్యాన్ని పరిశీలిస్తున్న మంత్రులు



జిల్లాకు 30 లక్షల గోనె సంచులు

● తేమ పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టొద్దు
● మా దృష్టికి వస్తే మిల్లర్లపై చర్యలు
● రేపటికల్లా ధాన్యం రవాణా బిల్లుల మంజూరు
● ఉపాధి నిధులతో సిమెంట్ ప్లాట్‌ఫారాలు
● కౌలురైతులకూ ప్రభుత్వ రాయితీలు
● రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

సంగం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : 'గత ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులు రవాణా ఖర్చులు రూ.1.4 కోట్లు ఇవ్వాలని జేసీ చెప్పారు. సోమవారానికల్లా రైతుల ఖాతాల్లో ఆ నగదు జమ అయ్యేలా చూస్తా'నని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు. శనివారం మండల కేంద్రమైన సంగంలో పీఏసీఎస్‌లో రూ.20.5 కోట్లతో నిర్మించిన గోదాము భవనం, ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం రైతులతో జరిగిన ముఖాముఖిలో మంత్రి మనోహర్ రైతులు వ్యక్తం చేసిన సందేహాలను నివృత్తి చేశారు. 'ఖరీఫ్ సీజన్‌లో ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా 5.13 కోట్ల గోనె సంచులు కొనుగోలు చేశాం. ఇప్పుడు జాయింట్ కలెక్టర్‌ను అడిగితే జిల్లాకు 30 లక్షల గోనె సంచులు, సంగం పీఏసీఎస్‌కు ప్రస్తుతం 15 వేల గోనె సంచులు కావాలని చెప్పారు. ఆ మేరకు జిల్లాకు కొత్త గోనె సంచులు సరఫరా చేయిస్తా. అలాగే పెండింగ్‌లో ఉన్న రవాణా బిల్లులు కూడా రేపటికల్లా మంజూరు చేస్తాను. తేమ శాతం విషయంలో రైతులు సందేహం అవసరం లేదు. మిల్లర్లతో మాట్లాడాం. రైతు సేవా కేంద్రంలో తేమశాతం ఎంత వస్తుందో మిల్లర్లు దాన్నే ప్రామాణికంగా తీసుకోవాలి. మిల్లర్లు ఇబ్బంది పెట్టినట్లు మా దృష్టికి తేస్తే అటువంటి మిల్లర్లపై చర్యలు తీసుకుంటాం. కల్లాల విషయంలో ప్రభుత్వం రాబోవు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ నిధులతో ప్రభుత్వ స్థలాల్లో సిమెంట్ ప్లాట్‌ఫారాల ఏర్పాటుకు వచ్చే ఖరీఫ్ సీజన్‌కు చర్యలు చేపడతాం. పంచాయతీ గ్రామసభలో తీర్మానిస్తే కౌలు రైతులు గుర్తింపు కార్డు ఇచ్చి అన్ని ప్రభుత్వ రాయితీలు వర్తించేలా త్వరలో చర్యలు చేపట్టతామని తెలిపారు.

● బ్యారేజిని హైవేకు అనుసంధానించాలి




సంగంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, పక్కన మరో మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి, జేసీ కార్తీక్ తదితరులు

మంత్రి ఆనం మాట్లాడుతూ సంగం బ్యారేజీని జాతీయ రహదారికి అనుసంధానం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డితోపాటు మంత్రి నాదేండ్ల మనోహర్ సహకారం అవసరమని కోరారు. అందుకు రూ. 75 కోట్లు అవసరమని గుర్తించామని సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయాల్సి ఉందన్నారు. సంగంలో ల్యాంకో ఫౌండేషన్ వృద్ధాశ్రమం కోసం నిర్మించిన భవనాలు ప్రభుత్వ ఐటీఐకి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, దాతల పేరుతో ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతి కోరుతున్నారన్నారు. అది జరిగితే సంగంలో సిల్క్ సెంటర్ ఏర్పాటుకు అవకాశం కలుగుతుందని చెప్పారు. ఎంపీ వేమిరెడ్డి కూటమి ప్రభుత్వం నెల్లూరు రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకుంటుందని చెప్పారు. అనంతరం కొరిమెర్ల రోడ్డులో ఉన్న రైస్ మిల్లును మంత్రులు తనిఖీ చేశారు. ధాన్యం సేకరణలో ఉన్న ఇబ్బందులపై మిల్లు యజమానితో మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వానికి, రైతులకు మధ్య మిల్లర్లు వారధిగా ఉండాలి కానీ వ్యాపార ధోరణిలో చూడకూడదని సూచించారు. మంత్రుల వెంట జేసీ కార్తీక్, ఆర్డీవో పావని, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ హజీజ్, రాష్ట్ర టిడ్కో చైర్మన్ అజయ్ కుమార్, సివిల్ సప్లయి డీఎం అర్జునరావు, ఇతర అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అంతకముందు వీరు బుచ్చిరెడ్డిపాళెంలో పర్యటించారు.

● ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేస్తాం

నెల్లూరు (హరనాథపురం) : రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. శనివారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో ధాన్యం కొనుగోళ్లపై జిల్లా అధికారులు, రైస్ మిల్లర్లతో ఆయన సమీక్షించారు. అధికారులంతా రాబోయే 2 నెలలు కష్టపడి పనిచేసి రైతాంగానికి మేలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, పారదర్శకంగా కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేస్తామని రైతులు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదన్నారు. మంత్రి ఆనం సూచనల మేరకు బ్యాంకు గ్యారెంటీలు అందజేసి, రైస్‌మిల్లర్ల భాగస్వామ్యంతో రైతాంగానికి మేలు చేకూరే విధంగా చర్యలు చేపడుతామన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైస్ మిల్లర్ల సహకారం గురించి, వారి సమస్యల గురించి విచారించారు. సేకరించిన సన్నబియ్యాన్ని రాబోయే రోజుల్లో పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల మధ్యాహ్న భోజన పథకానికి ఉపయోగిస్తామన్నారు. ఎండీయూ ఆపరేటర్ల విషయంలో కొన్ని సమస్యలు ఉన్నాయని, వెంటనే తనిఖీలు చేపట్టాలన్నారు. ఈ క్రాప్ నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి ఆనం మాట్లాడుతూ జేసీ స్థాయి నుంచి కిందిస్థాయి అధికారి వరకు అంతా కష్టపడి పనిచేసి రైతాంగానికి న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, పౌర సరఫరాల డైరెక్టర్ పట్టాభిరామిరెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ చైర్మన్ రంగయ్యనాయుడు, సోమశిల ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కేశవచౌదరి, పౌరసరఫరాల శాఖ డీఎం అర్జున్, డీఎస్‌ఓ అంకయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

నేడు గ్రూప్-2 పరీక్ష

● జిల్లాలో ఏడు కేంద్రాల్లో నిర్వహణ
● వదంతులు నమ్మొద్దు : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం (నేడు) ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను నిర్వహించనున్నారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని ఏడుకేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం ఈ పరీక్షను నిర్వహిస్తారు. కోవూరు మండలం గంగవరంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల, నెల్లూరు వీఆర్ పీజీ స్టడీస్, నెల్లూరు ధనలక్ష్మీపురంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల, వెంకటాచలం సమీపంలోని క్యాబా ఇంజనీరింగ్ కళాశాల, నెల్లూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, ధనలక్ష్మీపురంలోని నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్, నెల్లూరు రామలింగాపురంలోని జగన్స్ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఆర్వో ఉదయభాస్కర్‌రావు. పేర్కొన్నారు. ఈ కేంద్రాలకు లైజనింగ్ అధికారులను నియమించినట్లు ఆయన తెలిపారు. మొత్తం 4102 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జెరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు తెరుచుకోకుండా, 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నామన్నారు. సెల్‌ఫోన్లను పరీక్ష కేంద్రంలోని డిపాజిట్ సెంటర్‌లో డిపాజిట్ చేయాలని తెలిపారు.

● కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఈ పరీక్షలను సక్రమంగా నిర్వహించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు డీఆర్వో తెలిపారు. కంట్రోల్ రూమ్‌లోని 0861 2331261 నెంబరుకు ఫోన్ చేసి అభ్యర్థులు తమ సమస్యలు తెలియచేయవచ్చని, ఇతర వివరాలు కూడా పొందవచ్చని తెలిపారు.

● వదంతులు నమ్మొద్దు

ఆదివారం (నేడు) గ్రూప్-2

- మిగతా 6లో..

బీమా లేదు రామా!

● పేదలకు అందని బీమా పథకం
● ఇంటిపెద్ద మరణిస్తే ఆర్థిక సంక్షోభం
● గత టీడీపీ ప్రభుత్వంలో 'చంద్రన్న బీమా'
● వైసీపీ పాలనలో మార్పులు
● పరిష్కరించని క్లెయిములు
● ఇప్పటికీ సుమారు రూ.2 కోట్లు పెండింగ్
● ఎన్నికల అనంతరం పూర్తిగా నిలిపివేత
● ఇప్పటికే సుమారు 700 మంది నమోదు
● పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం కసరత్తు?

6లో..

జీవిత బీమా కుటుంబానికి ధీమా అనేది ఆధునిక సమాజంలో అందరికీ వర్తించే సూత్రం. ముఖ్యంగా పేదల కుటుంబాల్లో ఇంటి పెద్ద ఆకస్మికంగా మరణిస్తే ఆ కుటుంబాల పరిస్థితి ఒక్కసారిగా తలకిందులవుతుంది. కుటుంబాన్ని పోషించే వ్యక్తి లేకపోతే ఆర్థికంగా చితికిపోతాయి. ఆ ప్రభావం పిల్లల చదువుపై, జీవన ప్రమాణాలపై పడుతుంది. ఒకప్పుడు ఇలాంటి కుటుంబాలకు ప్రభుత్వ బీమా పథకం కొంత వరకైనా భరోసానిచ్చేది. మరణించిన వెంటనే మట్టి ఖర్చులకు, ఆపై కుటుంబ సభ్యులకు బీమా నగదు లభించేది. కానీ, సుమారు ఏడాది కాలంగా ఈ పథకం అమలు కాకపోవడం, అంతకు ముందు వైసీపీ పాలనలో అలక్ష్యం కారణంగా వందలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం కరుణిస్తుందని ఎదురుచూస్తున్నాయి.

ఓయమ్మ.. దానిమ్మ!

● 'కండలేరు' కింద మిస్టరీగా తోటలసాగు
● టీజీపీ, అక్రమార్కుల మిలాఖత్
● 30 ఏళ్ల తర్వాత కూడా పరిహారానికి కేసులు
● ఇప్పటికే రూ.వందల కోట్ల చెల్లింపు
● ఈ కథేమిటో తేల్చాలని ఉద్యాన వర్సిటీకి లేఖ
● అయినా స్పందించని వర్సిటీ యంత్రాంగం

వివరాలు 7



తెలుగుగంగ ప్రాజెక్టు (టీజీపీ) భూసేకరణ విభాగంలో కొందరు అధికారులు, అక్రమార్కులు మిలాఖత్ అయ్యారు. జిల్లాలో సాగేకాని దానిమ్మ తోటలు కండలేరు జలాశయం నిర్మాణం జరిగిన ప్రాంతంలో వేల ఎకరాలు ఉన్నట్టు రికార్డులు సృష్టించారు. ఇంకేముంది... రూ.వందల కోట్ల ప్రజాధనాన్ని పరిహారం రూపంలో చెల్లించడం... ముప్పై ఏళ్ల తర్వాత కూడా ఇంకా తమకు పరిహారం సరిపోలేదంటూ కేసులు వేయడం పరిపాటిగా మారుతోంది. తాజాగా ఓ వ్యక్తికి రూ.70 లక్షలు చెల్లించేందుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. మరి కొందరు కూడా ఇదేమార్గంలో రూ.కోట్లు రాబట్టుకునేందుకు జోరుగా ప్రయత్నాలు సాగిస్తున్నారు.



శ్రీనివాస కల్యాణ వైభోగం

నెల్లూరులోని నిప్పో కర్మాగారం ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి, సమేత శ్రీనివాస కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. శ్రీనివాస కల్యాణ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో శనివారం ఉదయాస్తమాన సేవలు నిర్వహించారు. శ్రీనివాస వజ్ర కవచ మహాయాగం, మహా పూర్ణాహుతి జరిగాయి. సాయంత్రం నగరోత్సవం అనంతరం దేవదేవుని కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఆ తర్వాత పుష్పయాగం భక్తజనానికి కనువిందు చేసింది. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తుల గోవింద నామస్మరణ, అన్నమయ్య కీర్తనలతో పరిసరాలు మారు మోగాయి. ఈ కార్యక్రమాలను శ్రీనివాస కల్యాణ కమిటీ వ్యవస్థాపకుడు చెక్కా సునీల్, 28వ డివిజన్ కార్పొరేటర్ చెక్కా అహల్య, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

- నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి)





1బీ, అడంగల్ ఇవ్వండి

ఉదయగిరి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రీసర్వేలో జరిగిన తప్పిదాల వల్ల మండలంలోని పలువురు రైతులకు 1బీ, అడంగల్ రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు సత్వరమే చర్యలు చేపట్టి ఆన్‌లైన్‌లో వచ్చేలా చూడాలని శనివారం రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని బండగానిపల్లి పంచాయతీ కృష్ణారెడ్డిపల్లి గ్రామంలో రైతులు, వ్యవసాయ కూలీలు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ 1బీ, అడంగల్ రాకపోవడంతో రైతులు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారన్నారు. రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఆన్‌లైన్‌లో వారికి సంబంధించిన భూవివరాలు వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, నాయకులు నాయబ్, ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీమా లేదు రామా..!

● పేదలకు అందని బీమా పథకం ● 'చంద్రన్న బీమా' పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం కసరత్తు

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బీమా పథకం అమలులో లేకపోవడంతో ఎన్నో పేద కుటుంబాలు ఆర్థికంగా నలిగిపోతున్నాయి. పేదలకు ఈ పరిస్థితి రాకూడదన్న ఉద్దేశంతో 2016 అక్టోబరు 2వతేదీన నాటి తెలుగు దేశం ప్రభుత్వం చంద్రన్న బీమా పథకాన్ని ప్రారంభించింది. 18 నుంచి 70 ఏళ్లలోపు నిరుపేదలందరికీ ఈ పథకాన్ని వర్తింపజేసింది. ఏడాదికి కేవలం రూ.15 చెల్లిస్తే సరిపోయేది. 18 నుంచి 50 ఏళ్లలోపు వారు సహజ మరణం చెందితే బాధిత కుటుంబానికి రూ.2లక్షలు, 51 నుంచి 60 ఏళ్ల మధ్య వారు మరణిస్తే రూ.30 వేలు, అంగవైకల్యం ఏర్పడితే రూ.2.5లక్షలు వంతున పరిహారం చెల్లించేవారు. మృతి చెందిన లేదా ప్రమాదం జరిగిన రోజు నుంచి రెండు వారాల్లో బాధిత కుటుంబాలకు చెక్కు రూపంలో పరిహారం అందించేవారు. బీమా మిత్రల ద్వారా ఈ పథకాన్ని అమలు చేసింది. బీమా చేసిన వ్యక్తి మరణిస్తే వారి వివరాలను రెండు గంటల్లో రిజిస్ట్రేషన్ చేసి, ఆరు గంటల్లో బాధిత కుటుంబం దగ్గరికే బీమా మిత్రలు వెళ్లి మట్టి ఖర్చుల కింద రూ.5వేలు చెల్లించేవారు. అనంతరం మరణించిన వ్యక్తికి సంబంధించిన పూర్తి వివరాలను రెండు రోజుల్లో నమోదు చేసేవారు. ఈ విధానంలో ఒక్కొక్క క్లెయిమ్ నమోదు చేసినందుకు బీమా మిత్రలకు రూ.250 నుంచి రూ.500 వంతున ప్రభుత్వం చెల్లించేది.

● వైసీపీ పాలనలో కుదింపు.. పెండింగ్

వైసీపీ అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారిపోయింది. చంద్రన్న బీమా పథకాన్ని వైఎస్‌ఆర్ బీమా పథకంగా పేరు మార్చడమే కాకుండా పరిహారం నిబంధనలు కూడా మార్చేసింది. బీమా మిత్రలను తొలగించి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా పథకాన్ని అమలు చేసింది. క్లెయిముల పరిష్కారం కూడా నత్తనడ కన సాగింది. కేవలం బియ్యం కార్డుదారులను మాత్రమే ఈ పథకానికి అర్హులుగా నిర్ణయించింది.. అంతే కాకుండా 18 నుంచి 50 ఏళ్ల వయసు వారు సహజ మరణం చెందితే అప్పటి వరకు ఇస్తున్న రూ.2లక్షల పరిహారాన్ని రూ.1లక్షకు కుదించింది. 18 నుంచి 70 సంవత్సరాల మధ్య వయసు వారు ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తి అంగవైకల్యం సంభవిస్తే రూ.5లక్షల పరిహారం అందించే పద్ధతి పెట్టింది. అయితే జిల్లాలో వైసీపీ హయాంలో చేసిన క్లెయిములకు సంబంధించి ఇప్పటికీ సుమారు 250 మందికి రూ.2కోట్ల వరకు చెల్లింపులు చేయాల్సి ఉందని సమాచారం.



● త్వరలో పునరుద్ధరణ?

ప్రస్తుత కూటమి ప్రభుత్వం చంద్రన్న బీమా పథకాన్ని పున రుద్ధరించే ఆలోచనలో ఉంది. గతంలో కంటే మరింత మెరుగైన ప్రయోజనాలతో సహజ మరణానికి రూ.2లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10లక్షలు చెల్లించేలా పథకాన్ని అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అయితే దీనిని గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అమలు చేయాలా, పేదరిక నిర్మూలన సొసైటీ ద్వారా అమలు చేయాలా..? అనే అంశంపై చర్చలు జరుపుతోందని, త్వరలోనే విధివిధానాలను ఖరారు చేసి పథకాన్ని పట్టాలెక్కించేలా చర్యలు తీసుకుంటోందని తెలిసింది. అయితే, గత ప్రభుత్వంలో పెండింగ్ క్లెయిములు చెల్లిస్తుందా?, ఆ తర్వాత మరణించిన వారి కుటుంబాలకు పథకాన్ని వర్తింపజేస్తుందా అనేది ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

● నిలిచిపోయిన పథకం

గతేడాది ఎన్నికలప్పటి నుంచి పేదల బీమా పథకం అమలు కావడం లేదు. దీనివల్ల రెక్కాడితే గానీ డొక్కాడని వ్యవసాయ కూలీలు, కుల వృత్తులు చేసుకునే పేదలు, హమాలీలు, చిన్న, సన్నకారు రైతులు, కళాకారులు, వీధి వ్యాపారులు, అసంఘటిత రంగ కార్మికులు.. ఇలా పేద కుటుంబాలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాయి. అయితే మరణించిన వారి వివరాలను మాత్రం యంత్రాంగం నమోదు చేస్తున్నట్లు తెలిసింది. ఆ విధంగా సుమారు 10 మాసాలుగా జిల్లాలో రమారమి 700 మంది పేర్లు బీమా కోసం నమోదు చేసినట్లు సమాచారం.

సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యం

● లోపల పొదుపు మహిళలు.. బయట తాళం వేసుకుని వెళ్లిన సిబ్బంది

పొదలకూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యంతో నలుగురు పొదుపు మహిళలు గంటపాటు ఆందోళనకు గురైన ఘటన శనివారం పొదలకూరులో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పొదలకూరు పట్టణంలోని బిట్-2 సచివాలయంలో మిద్దెపైన గదిలో ఆడిట్‌లో భాగంగా నలుగురు పొదుపు మహిళలు ఉన్నారు. కింద భాగంలో విధుల్లో ఉన్న సచివాలయ ఉద్యోగులు విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే ముందు పై అంతస్తులో ఎవరైనా ఉన్నారా లేదా అని చూడకుండా సచివాలయానికి తాళాలు వేసుకుని వెళ్లారు. కొద్దిసేపటికి పైన ఉన్న నలుగురు మహిళలు కిందకి రాగా సచివాలయానికి తాళం వేసి ఉంది. ఈ క్రమంలో ఎంతసేపు తలుపులు తట్టినా ప్రయోజనం లేకపోయింది. దీంతో గంటపాటు ఆ నలుగురు పొదుపు మహిళలు ఆందోళనకు గురయ్యారు. వాళ్ల కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా వారు సచివాలయం వద్దకు వచ్చి ఉద్యోగులకు సమాచారం ఇచ్చి పడిగాపులు కాశారు. ఆ సమయంలో సచివాలయ ఉద్యోగులు తాళాలతో అక్కడికి వస్తే పొదుపు మహిళల బంధువులు, కుటుంబ సభ్యులు మండిపడుతారని గ్రహించి పంచాయతీ ప్లంబర్ ప్రసాద్‌ని పిలిపించి అతని వద్ద తాళాలు పంపించారు. అతను తాళాలు తియ్యడంతో ఊపిరిపీల్చుకున్న ఆ మహిళలు సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



సచివాలయం లోపల ఉన్న పొదుపు మహిళలు

ఇంటర్ పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలి

● డీఆర్వో ఉదయభాస్కర్‌రావు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్చి ఒకటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) ఉదయభాస్కర్‌రావు తెలిపారు. నెల్లూరు నగరంలోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం చీఫ్, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, కస్టోడియన్లకు నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించి, పరీక్షలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. విద్యార్థులకు కనీస అవసరాలతోపాటు అన్నీ సదుపాయాలు కల్పించాలని తెలిపారు. పరీక్షల ప్రారంభం నాటికి పూర్తిస్థాయిలో నివేదికలు ఎప్పటికప్పుడు తనకు అందచేయాలని తెలిపారు. ఆర్ఐవో డాక్టర్ ఎ.శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది ప్రథమ సంవత్సరం 28,176 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 25,024 మంది హాజరవుతున్నారన్నారు. 79 కేంద్రాల్లో ఐదు ఫ్లైయింగ్ స్క్వాడ్స్, ఐదు సిట్టింగ్ స్క్వాడ్స్‌లతోపాటు జిల్లా పరీక్షల కమిటీ నిరంతర పర్యవేక్షణతో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పరీక్షల సమాచారం, సమస్యలు తెలియచేసేందుకు ఇంటర్‌బోర్డు కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేసి ,0861-2320312 నెంబరును అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలో ఎవరైనాసరే ఈ నెంబరుకు ఫోన్ చేసి సమస్యలు తెలియచేయవచ్చని తెలిపారు. సమావేశంలో డీవీఈవో మధుబాబు, డీఈసీ సభ్యులు దీనదయాళ్, వేణుగోపాల్, కొండయ్య, జిల్లా బల్క్ ఇన్‌చార్జి రాఘవయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌వో ఉదయభాస్కర్‌రావు

ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి

క్వింటంకు రూ. 500 సబ్సిడీ ఇవ్వాలి ● కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తేవాలి

● కలెక్టరేట్ వద్ద వ్యవసాయ సంఘాల నిరసన

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పించాలని వ్యవసాయ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ వద్ద ఏపీ రైతు సంఘం, ఏపీ కౌలు రైతు సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ సంయుక్తంగా నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పులిగండ్ల శ్రీరాములు మాట్లాడారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వరికోతలు జరుగుతున్నాయన్నారు. అయితే అధికారులు ప్రకటించిన 523 రైతు సేవాకేంద్రాలు పరిధిలో ఇంకా 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దళారులు, మిల్లర్లు ఏకమై రైతులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. మద్దతు ధర కంటే తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ మిల్లర్లతో పనిలేకుండా రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. క్వింటాకు రూ. 500 సబ్సిడీ ఇవ్వాలని కోరారు. ఈకేవైసీ పూర్తి చేయని రైతుల నుంచి కూడా ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు టీవీవీ ప్రసాద్, పుల్లయ్య, వెంగయ్య మాట్లాడుతూ కౌలు రైతులు, పండించిన ధాన్యాన్ని అమ్ముకోవటానికి నిబంధనలు సడలించాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి రైతులే మిల్లులకు ధాన్యం తరలించే విధానానికి స్వస్తి పలకాలన్నారు. తూకాలలో మోసాలను అరికట్టాలన్నారు. తేమ మిషన్లు, గోతాలు సమకూర్చి, తగినంత సిబ్బందిని కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు మాదాల వెంకటేశ్వర్లు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వ్యవసాయ సంఘాల నాయకులు

● మంత్రి నాదెండ్లకు వినతిపత్రం

పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్‌కు కలెక్టరేట్‌లో రైతు నాయకులు వినతి పత్రం సమర్పించారు. రైతుల సమస్యలను పరిష్కరి స్తానని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రితోపాటు దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి కూడా పాల్గొన్నారు.

...ఆ నగదును జీతాల్లో రికవరీ చేయండి!

● నెల్లూరు కమిషనర్ ఆదేశాలు

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పురపాలక శాఖ అందిస్తున్న వివిధ సేవలకుగాను ప్రజల నుంచి వసూలు చేసిన నగదును సచివాలయ ఉద్యోగులు కార్పొరేషన్ ఖజానాలో జమ చేయకపోవడంపై నగర కమిషనర్ సూర్యతేజ మండిపడ్డారు. ఆ మొత్తాన్ని సదరు ఉద్యోగుల జీతాల నుంచి రికవరీ చేయాలని శనివారం ఆదేశాలిచ్చారు. నెల్లూరు నగరంలోని 44 సచివాలయాల్లోని ఉద్యోగులు ప్రజల నుంచి రశీదుల ద్వారా రూ. 5.73 లక్షలు వసూలు చేసినట్లు గుర్తించారు. ఆ మొత్తం నగర పాలక సంస్థకు జమ కాకపోవడంతో ఆ ఉద్యోగుల జీతాల నుంచి రాబట్టాలని ఉత్తర్వులిచ్చారు.

నేడు గ్రూప్-2 పరీక్షలు

(5వ పేజీ తరువాయి)

మెయిన్స్ పరీక్షలు యధాతథంగా జరుగుతాయని కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు పేపర్ -1, మధ్యాహ్నం 3 నుంచి 5.30 వరకు పేపర్-2 పరీక్ష జరుగుతుందని ఆయన తెలిపారు. 15 నిమిషాల ముందే అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి రావాలని తెలిపారు. గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష వాయిదా అంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని, దాన్ని ఎవరూ నమ్మవద్దని పేర్కొన్నారు. తప్పుడు ప్రచారం చేసేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని కలెక్టర్ హెచ్చరించారు.

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్‌ను, బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన్ను బీజేపీ నాయకులు శనివారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో గెస్ట్ మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం ఆరబోసుకునేందుకు కల్లాలు లేక, నిల్వ చేసుకునేందుకు గోదాములు లేక రైలు మిల్లర్లు అడిగిన ధరకే ధాన్యం అమ్మాల్సిన పరిస్థితులు రైతులకు ఏర్పడ్డాయన్నారు. ప్రభుత్వ మద్దతు ధరకు తగ్గకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చేవూరు వినయ్ ఇతర నేతలు నారాయణ, హర్షవర్ధన్, ఎస్‌కె యశ్వంత్‌సింగ్, గడ్డం విజయ్‌కుమార్, ఆల్తూరు హరి ఉన్నారు.



మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసిన బీజేపీ నేతలు

తెనాలి రామకృష్ణ దేశం గర్వించదగ్గ కవి : గంగిశెట్టి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : తెనాలి రామకృష్ణుడు తెలుగు కవే అయినప్పటికీ దక్షిణ భారతదేశమంతటా ఆయన కథలు ప్రచారంలో ఉన్నాయి, ఉత్తరాదిలో సైతం ప్రసిద్ధి పొందాయని బాలసాహితీ భూషణ్ డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ పేర్కొన్నారు. చేతన - సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం టౌనుహాల్ ఆవరణలోని వర్ధమాన సమాజం హాల్‌లో తెనాలి రామలింగ కవి సాహిత్య సభ జరిగింది. రామలింగ కవి వ్యక్తిత్వం, సాహిత్యంపై శివకుమార్ ప్రసంగించారు. ఎంతటి వారినైనా తన ప్రతిభా పాండిత్యాలతో రామలింగడు చిత్తు చేయగలడన్నారు. పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఉత్తర భారతదేశంలో బీర్బల్‌లాగా దక్షిణాదిలో రామలింగ కవి ప్రసిద్ధుడన్నారు. మాతృభాషా ఉద్యమ సమితి నేత చెలంచర్ల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సాహిత్యం మనసును వికసింపచేస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని చేతన సంస్థ కార్యదర్శి వై శేషగిరీశం, వీఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం సుబ్రహ్మణ్యం నిర్వహించారు. నలుబోలు బలరామయ్యనాయుడు, ఏ జయప్రకాష్, జీ సుభద్రాదేవి, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, సుబ్బారాయుడు, దుర్బా మురళీకృష్ణ, జనార్దన్, రమేష్, వాసంతి తదితరులు పాల్గొన్నారు.



శివకుమార్‌ను సత్కరిస్తున్న సాహిత్య సభ నిర్వాహకులు

రాజరాజేశ్వరి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాన్ని శనివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎం హరిహరనాథశర్మ కుటుంబం సందర్శించింది. అమ్మవారికి విశేష పూజలు చేశారు. అర్చకులు, వేదపండితుల తీర్థ ప్రసాదాలిచ్చి ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.



పది పరీక్షల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

● పాఠశాల విద్యాశాఖ అదనపు డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి



మాట్లాడుతున్న విద్యాశాఖ రాష్ట్ర అదనపు డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి, పక్కన జిల్లా అధికారులు

కావలి టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పది పరీక్షల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ రవీంద్రనాధ్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక శాంతినగర్‌లోని పాఠశాల సమావేశ మందిరంలో పది పరీక్షలకు సంబంధించి ఎంఈవోలు, సూపరిటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, సెంటర్ కస్టోడియన్లు, రూట్ ఆఫీసర్లకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా విద్యాధికారి బాలాజీరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. పది పరీక్షల విషయంలో గతంలో అనేక తప్పిదాలు జరిగాయని ఇకపై అలా జరిగేదానికి ఏమాత్రం అవకాశం లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎలాంటి చిన్న పొరపాటు జరిగినా ఇన్విజిలేటర్‌దే పూర్తి బాధ్యత అన్నారు. అనంతరం డీఈవో బాలాజిరావు మాట్లాడారు. మార్చి 3 నుంచి 15వరకు ఓపెన్ ఇంటర్ 17నుంచి 31వరకు, పది పరీక్షలు 17నుంచి 28వరకు ఓపెన్ స్కూల్ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. మొత్తం 33,443మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని జిల్లావ్యాప్తంగా 174 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, 9స్క్వాడ్లు పర్యవేక్షిస్తాయన్నారు. సమావేశంలో ఆర్‌జేడీ లింగేశ్వర రెడ్డి, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయం ఏఎన్‌ఎంల మెరిట్ జాబితా

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సచివాలయం ఏఎన్‌ఎంల పదోన్నతికి సంబంధించి ఫైనల్ మెరిట్ జాబితాను అందుబాటులో ఉంచినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. sps nellore.ap.gov.in/notice/recrutment అనే వెబ్‌సైట్‌ను చూడవచ్చని ఆమె తెలిపారు.

సచివాలయంలో సిబ్బంది ఏరీ..!?

సచివాలయాల్లో ఉద్యోగులు అందుబాటులో ఉండకపోవడంతో పనులు జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం సాయంత్రం 4.10 నిమిషాలకు స్థానిక సచివాలయాన్ని పరిశీలించగా ఉద్యోగులు లేక కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. కేవలం ఆధార్ అప్‌డేట్ చేసే ఆపరేటర్ మాత్రమే ఉన్నారు.

- అనంతసాగరం (ఆంధ్రజ్యోతి)





ఇలాగైతే ప్రమాదాలు జరగవా!?

బోగోలు మండలం పడమర పల్లెప్రాంతాల్లో వరి కోతలు ప్రారంభం అయ్యాయి. రైతులు ధాన్యాన్ని ఆర్అండ్‌బీ రోడ్లపై అరబోస్తున్నారు. ఈ సమస్యతో దగదర్తి, జలదంకి మండలాల నుంచి బోగోలుకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యంకు కప్పే పట్టాలు ఎగిరి పోకుండా పెద్ద రాళ్లను రోడ్డుకు అడ్డంగా ఉంచుతున్నారు. వాహనదారులు ఆదమరచి ప్రయాణిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు.

- బిట్రగుంట (ఆంధ్రజ్యోతి)

సందులో రోడ్డు కాదు.. మెయిన్ రోడ్డే!?

బోగోలు బజారు రైల్వే ఎల్సీగేటు 144కు పడమర వైపున ఉన్న మెయిన్ రోడ్డు ఇది. ప్రతిరోజూ ఈ ప్రాంతంలో ప్రైవేట్ వాహనాలు రోడ్డుపైనే నిలవడం, వాహనాల ఎక్కువగా వచ్చిన సమయంలో పరిస్థితి రద్దీని తలపిస్తోంది. అసలు వాహనాలు సందుల్లోని రోడ్డులో వెళుతున్నాయా? లేదా మెయిన్‌రోడ్డులో వెళుతున్నాయా? అన్నట్టు ఉంది ఇక్కడి పరిస్థితి. శనివారం అరగంట సేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాఫిక్ కంట్రోల్ చేసేందుకు పోలీసులు లేకపోవడం ఇక్కడ ఉన్న స్థానికులకు ఇవి నిత్య కృత్యాలే.

- బిట్రగుంట (ఆంధ్రజ్యోతి)



నేర వార్తలు

crime news ఆంధ్రజ్యోతి

రూ.45లక్షల విలువైన 42 కేజీల వెండి స్వాధీనం

- రహదారిపై తనిఖీల్లో పట్టివేత
- సీసీఎస్ పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు

వెంకటాచలం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద సుమారు రూ.45 లక్షల విలువైన 42 కేజీల వెండిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల మేరకు.. కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద శనివారం నెల్లూరు సీసీఎస్ సీఐ సీతారామయ్య ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న ఏపీ39ఎన్‌క్యూ4388 నెంబరు గల బెలోనో కారును తనిఖీ చేయగా అందులో ఎలాంటి బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న 42 కేజీల వెండిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న వెండి విలువ బహిరంగ మార్కెట్ ప్రకారం సుమారు రూ.45 లక్షలకు పైగానే ఉంటుంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటోను ఢీకొన్న కారు

ఒకరి మృతి.. ముగ్గురికి గాయాలు

మనుబోలు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై కొండూరు సత్రం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొండిపాక శీనయ్య(46) దుర్మరణం చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు... వెంకటాచలం మండలం కసుమూరు పంచాయతీ చింతపాళెంకు చెందిన కొండిపాక శీనయ్య, అదే గ్రామానికి చెందిన మస్తానయ్య, చిన్న వెంకయ్యలు తిరుపతి జిల్లా గూడూరు మండలం విందూరు గ్రామంలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లేందుకు వెంకటాచలంకు వచ్చి హైవేపై వెళుతున్న ప్యాసింజర్ ఆటో ఎక్కారు. ఆటో కొండూరుసత్రం సమీపంలోకి వచ్చే సరికి అదే మార్గంలో నెల్లూరు నుంచి చిల్లకూరుకు వెళుతున్న కారు ముందు వెళుతున్న ఆటోను అధిగమించే క్రమంలో ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడగా ఆటోలో ఉన్న శీనయ్య రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్ మామిడి రవితో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరాకేష్ తెలిపారు.

సోమశిలలో 60.774 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శనివారం 1,181 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 60.774 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,480, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు వదులుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	93
లేయర్ లైవ్	75
స్కిన్ చికెన్	170
స్కిన్‌లెస్	190
లేయర్	127

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8286
వెండి కిలో ధర	రూ. 99,400
వెండి ఒక గ్రాము	రూ. 102.40

ఓయమ్మ.. దానిమ్మ!

- 'కండలేరు' కింద మిస్టరీగా తోటలసాగు
- టీజీపీ, అక్రమార్కుల మిలాఖత్
- 30 ఏళ్ల తర్వాత కూడా పరిహారానికి కేసులు
- ఇప్పటికే రూ.వందల కోట్ల చెల్లింపు
- ఈ కథేమిటో తేల్చాలని ఉద్యాన వర్సిటీకి లేఖ
- స్పందించని వర్సిటీ యంత్రాంగం



నెల్లూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : కండలేరు ముంపు కింద దానిమ్మ చెట్లకు పరిహారం చెల్లింపుల వ్యవహారం మొదటి నుంచీ వివాదాస్పదంగా ఉంది. ప్రాజెక్టు నిర్మించే సమయంలో ముంపు ప్రాంతాల్లో కొందరు ఉద్దేశ పూర్వకంగా ఎక్కువ పరిహారం కోసం మహారాష్ట్ర నుంచి దానిమ్మ మొక్కలను తెచ్చి తాత్కాలికంగా నాటారన్న ప్రచారం ఉంది. అప్పట్లో పనిచేసిన అధికారులు వీరికి సహకరించడంతోనే ప్రస్తుతం రూ.వందల కోట్లు పరిహారంగా చెల్లించాల్సి వస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా పరిహారం చెల్లించే ముందు మొక్కలు ఏ దశలో ఉన్నాయి? నిజంగానే అక్కడ తోటల సాగు జరుగుతోందా!? అన్న వివరాలను అంచనా వేసి, ఆ మేరకు పరిహారం చెల్లించాలి. కానీ దానిమ్మ మొక్కలు ఉన్నట్లు రికార్డుల్లో నమోదు చేశారు తప్ప... మరే వివరాలు పొందుపరచలేదు. ఈ క్రమంలోనే 30 ఏళ్ల క్రితం ఈ దానిమ్మ చెట్లకు పరిహారం చెల్లించగా, ఆరోపణలు రావడంతో విచారణ కూడా జరిగింది. అప్పట్లో కేసులు కూడా పెట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. కానీ అప్పటి ప్రజాప్రతినిధుల సూచనలతో వెనక్కు తగ్గారు. అయితే దశాబ్దకాలంగా మళ్లీ దానిమ్మ చెట్ల పిటిషన్లు ఎక్కువయ్యాయి. గతంలో టీజీపీలో పనిచేసిన అధికారులు కూడా వీరితో కుమ్మక్కై పరిహారం చెల్లించినట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల కూడా రెండు గ్రామాల వ్యక్తులు తమ భూముల్లోని దానిమ్మ చెట్లకు పరిహారం ఇవ్వలేదని కోర్టుకు వెళ్లి ఆర్డర్ తెచ్చుకున్నారు. దీనిపై టీజీపీ అధికారులు అప్పీల్‌కు వెళ్లడంతో కోర్టులో కేసు నడుస్తోంది.

● టీజీపీనే ముద్దు

రెవెన్యూ ఉద్యోగులకు తమ శాఖ కన్నా టీజీపీ అంటేనే ముద్దుగా భావిస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన కొందరు అక్రమ సంపాదనకు అలవాటు పడి మరోచోటకు బదిలీ అయినా మళ్లీ ఇక్కడికే వచ్చేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటికే గతంలో ఇక్కడ పనిచేసి సస్పెండ్ అయి, ఆరోపణలు ఎదుర్కొన్న కొందరు అధికారులు, ఉద్యోగులు మళ్లీ ఇక్కడికే వస్తున్నారు. ఇక్కడ దీర్ఘకాలం పనిచేసిన ఓ ఉద్యోగిని ఇటీవల ముత్తుకూరుకు బదిలీ చేశారు. అయితే అక్కడికి వెళ్లాక కూడా ఆ ఉద్యోగి టీజీపీ ఫైళ్లనే చూస్తున్నారన్న ఫిర్యాదులు అందాయి. ముత్తుకూరులో చేయాల్సిన పనిని పక్కన పెట్టడంతో సదరు ఉద్యోగిపై స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పుడు ఆ ఉద్యోగిని తాత్కాలికంగా ఆర్డీవో కార్యాలయానికి బదిలీ చేసినట్లు కలెక్టరేట్‌లో చెప్పుకుంటున్నారు. ఈ ఉద్యోగి మళ్లీ టీజీపీకి పంపాలని కోరుతున్నట్లు ప్రచారం సాగుతోంది. అలాగే మరో ఉద్యోగికి కూడా టీజీపీ నుంచి బదిలీ అయ్యి మళ్లీ ఇక్కడకు వచ్చేందుకు సిఫారులు చేయించుకున్నట్లు తెలుస్తోంది.

● స్పందించని ఉద్యాన వర్సిటీ

రెండేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు, జేసీ కూర్మనాథ్‌లు టీజీపీ వ్యవహారాలపై దృష్టి పెట్టి విచారణ జరిపారు. ఆ క్రమంలోనే పెరంకొండ అక్రమ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దానిమ్మ చెట్లకు పరిహారం చెల్లించాలంటూ కేసులు వస్తుండటంతో అసలు కండలేరు పరిసర ప్రాంతాల్లో దానిమ్మ సాగుకు అనుకూలం కాదని, సాంకేతికంగా నిర్ధారించేందుకు అప్పటి జేసీ కడపలోని హార్టికల్చర్ యూనివర్సిటీకి లేఖ రాశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి దానిమ్మ సాగుకు అనుకూలమా.. అసలు గతంలో ఇక్కడ సాగు జరిగిందా.. అన్న వివరాలను అందజేయాలని కోరారు. కానీ ఆ విశ్వవిద్యాలయం ప్రతినిధులు పట్టించుకోలేదు. ఆ తర్వాత మరోసారి రిమైండర్ రాశారు. అప్పటికీ స్పందన లేదు. అయితే ఈ వ్యవహారంలో దళారులుగా వ్యవహరించే వ్యక్తులు యూనివర్సిటీ అధికారులు రిపోర్టు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో వర్సిటీ వారొచ్చి సాంకేతికంగా దానిమ్మ సాగు లేదని తేల్చాకగానీ దానిమ్మ తోటల సాగు తేలదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలకు 9 మంది గైర్హాజరు

వెంకటాచలం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో శనివారం జరిగిన డిగ్రీ మూడు, ఆరవ సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు 9 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 235 మంది విద్యార్థులకు 226 మంది హాజరయ్యారు.

సమస్యలు పరిష్కరించడయ్యా...?

- మాల సంక్షేమ సహకార ఆర్థిక సంస్థ చైర్మన్‌కు వినతుల వెల్లువ



విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న మాల మహానాడు నాయకులు వెంకయ్య, వెంకటరమణ తదితరులు

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరుకు శనివారం వచ్చిన మాల సంక్షేమ సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ చైర్మన్ విజయ్‌కుమార్‌కు పలువురు మాల సామాజికవర్గ నాయకులు సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాలమహానాడు కార్యనిర్వాహక అధ్యక్షుడు స్వర్ణ వెంకయ్య ఆధ్వర్యంలో జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు బల్లి వెంకయ్య, వాదనాల వెంకటరమణ, ఉద్యోగాల సంఘాల అధ్యక్షుడు విజయ్‌కుమార్, అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యుడు కొప్పాల రఘు, యువజన నాయకుడు బల్లి శరత్ కుమార్, తదితరులు విజయ్‌కుమార్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజే శారు. అనంతరం వారు మాట్లాడుతూ మాల కార్పొరేషన్ కార్యాలయం ఏర్పాటు చేసి, ఉద్యోగులను యుద్ధ ప్రాతిపదికన నియమించాలని కోరారు. గతంలో ఎత్తివేసిన 27 పథకాలను పునరుద్ధరించాలని కోరారు. నగరంలో అర్ధంతరంగా నిలిచిపోయిన అంబేడ్కర్ స్టడీ సర్కిల్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయించాలని కోరారు. మాలకార్పొరేషన్ ద్వారా పేద మాలలకు ప్రభుత్వ పథకాల లబ్ధి అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ డైరెక్టర్లు రమాదేవి, యుగంధర్, తదితరులు పాల్గన్నారు.

● కార్పొరేషన్‌ను బలోపేతం చేస్తాం

ఎస్సీ కార్పొరేషన్‌ను బలోపేతం చేస్తామని మాల సంక్షేమ సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ చైర్మన్ విజయ్‌కుమార్ చెప్పారు. శనివారం నగరంలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యమైపోయిందన్నారు. కార్పొరేషన్ స్థితిగతులు తెలుసుకోవడానికి జిల్లాల పర్యటన చేపట్టామన్నారు. నెల్లూరులో దళిత నాయకుల సమావేశం ఏర్పాటు చేసి సూచనలు తీసుకున్నామన్నారు. మాలయువతకు కార్పొరేషన్ ద్వారా మెరుగైన స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు

నెల్లూరు (హరనాథపురం) ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు చెప్పారు. శనివారం నెల్లూరు నగరంలోని పినాకినీ అతిథిగృహం ప్రాంగణంలో జేఏసీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఉద్యోగ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు బొప్పరాజుకు వివరించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు, పీఆర్సీ గురించి పలువురు సంఘం నేతలు ప్రస్తావించారు. స్పందించిన బొప్పరాజు సమాధానం ఇస్తూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ అమరావతి జిల్లా కార్యవర్గంలో కో చైర్మన్‌గా పనిచేసి, జనవరిలో పదవీ విరమణ పొందిన పొదిలి చిన్నయ్యను బొప్పరాజు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఆఫీసర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు, డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్వరరావు, ఇంజనీర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుమార్‌రెడ్డి, ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి, కార్యదర్శి ఓవీ ప్రసాద్, ఫైర్ శాఖ అధ్యక్షుడు చంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శరత్‌బాబు, డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చిరంజీవి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నాయకులు కె.కే.డానియేల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

నట్టల వ్యాధి మరణాలకు టీకాలతో అడ్డుకట్ట : డీడీ సోమయ్య

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువులైన కుక్కలు, పిల్లులు పుట్టిన రెండు వారాలకు నట్టలవ్యాధి నివారణ టీకాలు వేయడం ద్వారా, మరణాలను అరికట్టవచ్చని వెటర్నరీ పాలీక్లీనిక్(వీపీసీ) డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టీ. సోమయ్య పేర్కొన్నారు. నెల్లూరులోని వీపీసీలో శనివారం ఐదేళ్ల కుక్కకు మూత్రాశయానికి సంబంధించిన శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అత్యాధునిక పరికరాలతో పెంపుడు జంతువులకు టుబెక్టమీ, కాస్ట్రేషన్, ఎముకలు విరిగితే కట్టుకట్టడం, కిడ్నీలో రాళ్ల తొలగింపు తదితర శస్త్ర చికిత్సలు చేస్తున్నామన్నారు. వ్యాధి నిరోధక టీకాలు, శస్త్ర చికిత్సలు వంటి వైద్యసేవలను రోజుకు 125 నుంచి 150 జంతువులకు అందిస్తున్నట్లు చెప్పారు. జంతు ప్రేమికులు, పెంపుడు జంతువుల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్న జంతువుల వైద్యశాల భవనం మరమ్మతులకు పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదరనాయుడు రూ.3.5లక్షలు మంజూరు చేశారని, రూఫ్ లెవల్ పనులు పూర్తయ్యాయన్నారు. అలాగే విద్యుత్, నీటివసతి కూడా కల్పించామన్నారు. ఈ సమావేశంలో ఏడీ డాక్టర్ ఎం.మాలకొండయ్య, వీఏఎస్ డాక్టర్ టీ.జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె గొంతులకు రక్షిత జలాలు

- వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆగిన జేజేఎం పనులు
- కూటమి ప్రభుత్వం చొరవతో ప్రారంభం కానున్న వర్కులు
- గ్రామాల్లో ముమ్మరంగా సర్వే

ఉదయగిరి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పల్లె గొంతులకు రక్షిత జలాలు అందించాలన్న ధ్యేయంతో కూటమి ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ (జేజేఎం) పథకంపై ప్రత్యేక దృష్టి సారించింది. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఆగిన పనులను మళ్లీ ముమ్మరం చేసింది. ప్రస్తుతం ఉదయగిరి నియోజకవర్గంలోని పలు మండలాల్లో సమర్ధ ఇన్‌ఫ్రాటెక్ పూణే సంస్థ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (వోబీహెచ్‌ఆర్)ల నిర్మాణానికి సర్వే చేపడుతోంది.

మార్చి 15 నాటికి సర్వే పూర్తి



జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా వోబీహెచ్‌ఆర్ ట్యాంకుల ఏర్పాటుకు సమర్ధ్ ఇన్‌ఫ్రాటెక్ పూణే సంస్థ చేపడుతున్న సర్వే మార్చి 15వ తేదీ నాటికి పూర్తవుతుంది. సర్వే నివేదిక ప్రభుత్వానికి అందించగానే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జేజేఎం పనులు చేపడతాం.

- రామకృష్ణారావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఉదయగిరి

వైసీపీ నిర్లక్ష్యంతో నిలిచిపోయిన పనులు

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా తాగునీరు అందించాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జల్‌జీవన్ మిషన్ పథకానికి శ్రీకారం చుట్టింది. కాగా, ఈ పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కాంట్రాక్టర్లకు బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు ప్రారంభానికి చర్యలు చేపట్టింది. సోమశిల జలాశయం నుంచి నీటిని తరలించి ఇక్కడ ఏర్పాటు చేసిన వోబీహెచ్‌ఆర్ ట్యాంకుల్లో నింపి పైపులైన్‌ల ద్వారా ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తారు. అందులో భాగంగా ఓ ప్రైవేటు సంస్థ ద్వారా సర్వే చేపట్టింది. 2027 నాటికి ప్రతి ఇంటికీ రక్షిత జలాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.



జల్‌జీవన్ మిషన్ పథకం అమలుకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న సర్వే బృందం, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు (ఫైల్)

బలహీనవర్గాల అభివృద్ధి చంద్రన్నతోనే సాధ్యం

- కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి
- గృహనిర్మాణ అధికారులతో ప్రగతిపై సమీక్ష
- 12 మందికి ఎస్సీ కార్పొరేషన్ రుణాల చెక్కు అందజేత

కావలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడితోనే సాధ్యమని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. ప్రధానమంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజనపథకం ద్వారా పీఎం అజయ్- ఉన్నతి రుణాల పంపిణీ కార్యక్రమం శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, డీఆర్డీఏ పీడీ నాగరాజుకుమారితో కలిసి నియోజకవర్గంలోని 12మంది లబ్ధిదారులకు ఎస్సీ కార్పొరేషన్ కింద రూ.22,05,000లక్షల చెక్కులను అందజేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాక ముందే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. రామాయపట్నం పోర్ట్, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, దగదర్తి విమానాశ్రయాలను త్వరలోనే పూర్తి చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో రోడ్లు, డ్రైన్లు నిర్మించటంతో పాటు ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా సుమారు రూ.కోటి వరకు లబ్ధిదారులకు వైద్యఖర్చుల నిమిత్తం అందజేశామన్నారు. బీసీ, కాపు, వైశ్య పలు అనుబంధ ఉపకులాలకు చెందిన వారికి పార్టీలకతీతంగా త్వరలో రుణాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు ఆవుల రామకృష్ణ, నారయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

పేదోడి సొంతింటి కల నెరవేర్చుతాం

ప్రతిపేదవాడి సొంతింటి కల నెరవేర్చటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అందుకు అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి సూచించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఆర్డీవో వంశీక్రిష్ణతో కలిసి గృహనిర్మాణ ప్రగతిపె నియోజకవర్గ అధికారులు, సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి సొంతిల్లు కట్టించి ఇవ్వాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్దేశ్యమని అందుకు గృహనిర్మాణ ప్రగతి పథకాన్ని ప్రవేశ పెట్టారని గుర్తుచేశారు. పార్టీలకతీతంగా ప్రతి పేదవాడిని గుర్తించి వారికి ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణానికి ప్రభుత్వం రూ.లక్ష పెంచి రూ.2.5లక్షలు మంజూరు చేస్తుందన్నారు. అదనంగా ఎస్టీలకు రూ.75వేలు, ఎస్సీలకు రూ.50వేలు, కులవృత్తుల వారికి రూ.50వేలు ఆయా కార్పొరేషన్ల ద్వారా అందజేస్తామన్నారు. అవి కాకుండా బ్యాంకర్లు వడ్డీ లేని రుణాలు అందజేస్తామని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి నియోజకవర్గ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలన్నారు. కావలిలో అవినీతి రహితపాలన అందించటమే తన లక్ష్యం అన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, డీఎల్‌డీవో విజయకుమార్, హౌసింగ్ ఈఈ మాధవరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, పార్టీ మండలాధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ, తహసీల్దార్లు, ఎమ్పీడీవోలు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్నఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, డీఆర్డీఏ పీడీ తదితరులు

న్యూస్ బాక్స్

ప్రైవేట్ వైద్యశాల తనిఖీ


సర్టిఫికెట్‌ను పరిశీలిస్తున్న వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి

కలిగిరి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని నూర్ క్లినిక్‌ను శని వారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి సందర్శించారు. క్లినిక్‌లో వైద్య సేవలు అందిస్తున్న నిర్వాహకుడు మొగల్ ఆరీఫ్‌ను వివరాలు అడిగితెలుసుకున్నారు. అనుమతులు లేకుండా క్లినిక్ నిర్వహిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు తనిఖీ చేపట్టామన్నారు. అనంతనం ఏపీ మెడికల్ కౌన్సిల్ నందు రిజిష్ట్రేషన్ చేసుకున్న సర్టిఫికెట్‌ను పరిశీలించారు. వైద్యసేవల అనుమతుల కోసం జిల్లా వైద్యఆరోగ్య శాఖను సంప్రదించాలని సూచించారు. ఆమె వెంట ఎస్‌హెచ్‌ఓ సాయిలక్ష్మి ఉన్నారు.

జ్ఞానజ్యోతిపై శిక్షణ


పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):స్థానిక హైస్కూల్‌లో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వ హించారు. కార్యక్రమంలో భాగంగా సృజనాత్మకత, సామాజిక భావోద్వేగ అభివృద్ధికి సంబంధించి ఇద్దరు చిన్నారుల పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సునీత మాట్లాడారు. ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య అందించాలని, గర్భవతులు, బాలింతలకు పోషక విలువలు కలిగిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ హెచ్‌ఎం శైలజ, డీఆర్‌పీలు జనార్దన్, జాన్సన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫ్యామిలీ గ్లోరీ కార్యక్రమం


తల్లి ఆశీర్వాదం తీసుకుంటున్న ఓ విద్యార్థి

కందుకూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):స్థానిక కోటారెడ్డినగర్‌లోని శ్రీచైతన్య హైస్కూల్‌లో శనివారం ఫ్యామిలీ గ్లోరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థులు తల్లిదండ్రులను నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. బిడ్డల ఆప్యాయతకు భావోద్వేగానికిలోనై తల్లిదండ్రులు గుండెలకు హత్తుకున్న సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అకడమిక్ డీన్ బ్రహ్మయ్య, ఇన్‌చార్జి శివయ్య, ఆర్ఐ అనిల్‌కుమార్, శ్రీనివాసులు, ఏవో సురేష్ నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

అల్లూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతిరైతు తమ భూములకు సంబంధించి ప్రభుత్వ లబ్ధి పొందాలంటే తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం మండలకేంద్రంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందడంతో పాటు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం ద్వారా విక్రయించుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం రైతులకు మద్దతు ధరను కల్పించేలా ఏర్పాటు చేసిందన్నారు. ఈ-కేవైసీతోపాటు రైతు రిజిస్ట్రేషన్ నెంబరును ఖచ్చితంగా పొందాలన్నారు. కార్యక్రమంలో రైతులు, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

ఘుటిక సిద్ధేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం ప్రారంభం

సీతారామపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొలంగారిపల్లి గ్రామ సమీపంలో కొమ్మిశెట్టి సుబ్బారావు, సుభరత్నమ్మ దంపతుల సహకారంతో నిర్మించిన సిద్దేశ్వర స్వామి ఆలయ ముఖ ద్వార పారంభోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కాకర్ల సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలనంతరం ముఖద్వారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఈప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గంలో22వాటర్ ప్లాంట్లను త్వరలో ప్రారంభిస్తున్నామని తెలిపారు. అనంతరం పలు గ్రామాల సమస్యలను నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరించారు. కార్య క్రమంలో మాజీ జడ్పీచైర్మన్ పొన్నుబోయిన చెంచలబాబు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి మస్నేటి వెంకటరెడ్డి, మండల కన్వీనర్ కప్ప ప్రభాకర్ రాజు, మాజీ జడ్పిటిసి కలివెట జ్యోతి, ఆదినారాయణ, ఎడమ ప్రవీణ్ కుమార్, వెంకటసుబ్బయ్య, తమిశెట్టి రమణయ్య పాల్గొన్నారు.


రిబ్బన్ కట్ చేసి ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


సైన్స్ ఎగ్జిబిట్స్‌ను తిలకిస్తున్న డాక్టర్ నాగభార్గవి

కావలిటౌన్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి) పట్టణ రాజావీదిలోని ఓవెల్ మినర్వా ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన వైజ్ఞానిక ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో మెగా సైన్స్ ఎక్స్‌పో నిర్వహించగా విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ శివయ్య పర్యవేక్షణలో జరిగిన కార్య క్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ కర్నాటి రోహిత్, డాక్టర్ నాగభార్గవి దంపతులు పాల్గొని ఎగ్జిబిట్స్ తిలకించి విద్యార్థులను అభినందించారు. వారు మాట్లాడుతూ మానవ జీవితం సైన్స్‌తో ముడిపడి వుందని విద్యార్థులు చిన్నతనంనుంచే శాస్త్రీయ దృక్పధం అలవర్చుకోవాలన్నారు. వివిధ వేషాధారణలో అలరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో ఏజీఎం జయదేవ్, డీజీఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

జేవీవీ వక్తృత్వ, పాటల పోటీలు

జాతీయ సైన్స్ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా జేవీవీ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రతిభా పోటీల్లో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జేవీవీ పట్టణ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించారు. ప్రముఖ గాయకులు రామచంద్రయ్య, ఉమాశర్మ, విశ్రాంత ఉపాధ్యాయులు జాఫర్‌ఖాన్, శారద, వెంకయ్య, చంద్రశేఖర్‌లు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుటకు, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కలిసి పనిచేద్దాం, హరిత వనాలు పెంచడంలో నేను ముందుంటా అనే అంశాలపై వక్తృత్వ పోటీలు, సందేశాత్మక పాటల పోటీలు జరిగాయి.

సాయిపేటలో కుక్కలకు యాంటీరేబిస్ వ్యాక్సిన్

కొండాపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):సాయిపేట పంచాయతీలోని కొత్తపాలెం, మెయిన్ విలేజి, బీసీ, ఎస్టీ కాలనీల్లోని వీధి కుక్కలకు బ్లూ క్రాస్ సొసైటీ నెల్లూరు వారి సహకారంతో శని వారం వైద్యాధికారి మధు యాంటీరేబీస్ వ్యాక్సిన్ వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుక్కలకు సోకే ప్రాణాంతకమైన జునోటిక్ వ్యాధి ప్రబలకుండా ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం జంతువుల సంక్షేమం, ఎస్‌పీసీఏ చట్టం, రేబీస్ వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్య దర్శి ప్రదీప్, సర్పంచ్ కోటేశ్వరమ్మ, గ్రామస్థులు చిమ్మిలి శ్రీదేవి, డేగ శ్రీనివాసులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.


కుక్కకు ఇంజక్షన్ వేస్తున్న వైద్యాధికారి మధు తదితరులు

ఉలవపాడులో వైద్య శిబిరం

ఉలవపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పాస్టర్ల సంఘం సభ్యులు శనివారం మండలకేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సరయూస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ జనరల్, డయాబెటిక్, ఎమర్జెన్సీ వైద్య నిపుణులు రాజేష్, గర్భ కోశ వ్యాధి నిపుణులు సుస్మితలు 100మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వ హించారు. ఈసీజీ, షుగర్, ప్రెగ్నెన్సీ డాప్లర్ స్కాన్, బీపీ తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అందచేశారు. అనంతరం పాస్టర్లు వైద్య దంపతులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రత్నకుమార్, కమలాకర్, జోసెఫ్ కుమార్ పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన

ఉదయగిరి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గడ్డంవారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం గండిపాళెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య, ప్రధానోపాధ్యాయుడు మాలకొండయ్య, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● దుత్తలూరు: మండలంలోని నందిపాడు కేజీబీవీలోని విద్యార్థులకు దుత్తలూరు పీహెచ్‌సీ వైద్యఆరోగ్య సిబ్బంది క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య బోధకురాలు బీబీజాన్, ఆరోగ్య పర్యవేక్షకుడు ఖాజామొహిద్దీన్, ప్రిన్సిపాల్ అంజనీదేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి


చదలవాడ జేమ్స్ (ఫైల్)

కందుకూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో శనివారం కందుకూరు వ్యవసాయ మార్కెటింగ్‌శాఖలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి చదలవాడ జేమ్స్ (57) గుడ్లూరు నుంచి కందుకూరుకు ఆర్టీసీ బస్సులో వెళ్తున్నాడు. ఈ సమయంలో ఆయనకు గుండెపోటు రావడంతో తోటి ప్రయాణికులు గుర్తించి అతన్ని తక్షణమే కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అతన్ని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

బోధనోపకరణాలతో విద్యాబోధన చేయాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు బోధనోపకరణాలతో విద్యాబోధన చేయాలి ఎంఈవో-2 శ్రీనివాసులు సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమంలో పాల్గొని కార్యకర్తలు తయారుచేసిన బోధనో పకరణాలను పరిశీలించారు. చిన్నారులను బాధ్య తగా చూసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలకేశవులు, రిసోర్సుపర్సన్‌లు ఫణికుమార్, సుబ్బారెడ్డి, సారధి పాల్గొన్నారు.

ఉయ్యాలవాడకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ఉదయగిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో శనివారం స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ.కృష్ణారెడ్డి, అధ్యాపకులు ఉయ్యాలవాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పదం అధికారి రమేష్, అధ్యాపకులు గోపికృష్ణ, రఘునాథ్‌రెడ్డి, సునీత, ఏవో కమ లప్రియ, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సోమశిల జలాల సరఫరాపై సర్వే

సీతారామపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలానికి సోమశిల జలాలను అందించేందుకు సమర్థ్ కంపెనీ బృంద సభ్యులు సీతారామపురం గ్రామ పంచాయతీలో శనివారం సర్వే చేపట్టారు. ఈసందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనీనిస్సీ మాట్లాడుతూ ప్రభుత్వం సోమశిల జలాల సరఫరా కోసం సర్వే ప్రక్రియను ప్రైవేట్ కంపెనీకి అనుమతి ఇచ్చిందని తెలిపారు. ట్రంక్‌లైన్ ఏర్పాట్లతో మండలంలోని అన్ని గ్రామాలకు సోమశిల జలాలు అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు.

రోజుకి రూ.300 ఉపాధి కూలి

ఉలవపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు రూ.300 వచ్చే విధంగా పనిచేయాలని కందుకూరు ఏపీడీ బాబురావు ఉపాధి కూలీలకు సూచించారు. శనివారం ఆయన బద్దిపూడిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. రోజుకి 4గంటలు తగ్గకుండా చేయిస్తే అప్పుడే పూర్తి స్థాయిలో కూలీ గిట్టుబాటు అవుతుందని, అందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు.

మొగిలిచెర్లకు ప్రత్యేక బస్సులు

● సంగమేశ్వరానికి 5..

లింగసముద్రం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న జరిగే మహాశివరాత్రి పండుగకు మొగిలిచెర్ల శ్రీదత్తాత్రేస్వామి ఆలయానికి కందుకూరు ఆర్టీసీ డిపో నుంచి 30ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు శనివారం డిపో సహాయ మేనేజరు శ్యాంప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన లింగసముద్రం, మొగిలిచెర్లలోని ఆలయాల సమీపంలోని బస్సులు నిలుపు స్థలాలను పరిశీలించారు. అనంతరం మొగిలి చెర్లలోని దత్తాత్రేయస్వామి ధర్మకర్త పవని ప్రసాద్, లింగసముద్రం తిరుమణిశెట్టి కోటయ్య మందిరం నిర్వాహకులు తిరుపతయ్యలతో వసతులపై చర్చించారు. ఆయన వెంట సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

ఇంటింటికి తాగునీరు అందిస్తాం

బిట్రగుంట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ బృందం సభ్యులు శనివారం సోమేశ్వరపురం మంచినీటి పథకాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలో సర్వే నిర్వహించారు. వారి వెంట టీడీపీ మండల కన్వీనర్ ఎం.నాగేశ్వరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు ఉన్నారు. మండలంలో మూడు డీజీపీఎస్ బృంద సభ్యులు సర్వేలో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేతలు కే.వెంకటేశ్వరరెడ్డి, మల్లికార్జున, సుబ్బారెడ్డి ఉన్నారు.

సేంద్రియ ఎరువులు వాడాలి

బిట్రగుంట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): భూసారం పెంచేందుకు సేంద్రియ ఎరువులు వాడాలని జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ సహాయక అధికారిణి మారుతీదేవి తెలిపారు. శనివారరం బోగోలు ఆర్‌బీకేలో పోషకాహార ధాన్యాలు, కోత అనంతరం రైతుల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వహించిన అవగాహన సదస్సు పాల్గొని మాటాడారు. మండల వ్యవసాయ అధికారిణి విజయలక్ష్మీ, వ్యవసాయ పరిశోధన స్థానం నెల్లూరు శాస్త్రవేత ఓబయ్య, జిల్లా వనరుల కేంద్రం ఏవో గీతాకుమారి పాల్గొని రైతులకు పంటల సాగుపై సూచనలిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ బోగోలు ఇన్‌చాచార్జి మంతాలవెంకయ్య, నీటి సంఘం అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, శీనయ్య ఉన్నారు.

ఖాదర్‌వలి గంధోత్సవం

బిట్రగుంట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విశ్వనాథరావుపేటపంచాయతీ కొత్తూరులో ఖాదర్‌వలి దర్గాలో గంధ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. పఠాన్ నజీర్‌ఖాన్ ఇంటి వద్ద నుంచి గంధం, జెండాలను మేళతాలతో దర్గా వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

కందుకూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): 14మంది లబ్ధిదారులకు రూ.9 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అందజేశారు. పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రం ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎప్పటికప్పుడు విడుదల చేస్తూ సీఎం చంద్రబాబు పేదలను ఆదుకుంటున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, రఫి, సీహెచ్ కొండయ్య, నార్నే రోశయ్య తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

గిట్టుబాటు ధర కల్పించాలని సీఐటీయూ ధర్నా


సబ్‌కలెక్టర్ శ్రీపూజకు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

కందుకూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతు సంఘం, సీఐటీయూ, వ్యవసాయ కార్మికసంఘాల నాయకులు డిమాండు చేశారు. శనివారం ఈ విషయంపై సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడారు. జస్టిస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను పక్కన పెట్టి రైతులకు గిట్టుబాటుధర కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల తీరును తప్పుపట్టారు. పెట్టుబడులు అధికమై గిట్టబాటుధర రాక, అప్పులపాలై రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో వరి, పొగాకు, మిర్చి, శనగ పంటలను అధికంగా సాగు చేస్తారని తెలిపారు. పొగాకు పంటకు క్వింటాకు సగటు ధర రూ.35వేలు, మిర్చి క్వింటాకు రూ.25వేలు, వరి ధాన్యానికి క్వింటాకు రూ.4500 మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ శ్రీపూజకు అందజేశారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం జిల్లా స హాయ కార్యదర్శి మాదాల రమణయ్య, జిల్లా నాయకులు ఎస్.గౌస్, జీవీబీ కుమార్, కొట్టే వెంకయ్య, దామా కృష్ణయ్య, వర్ధినేని సిద్దయ్య, దాసరి రామూర్తి, డీఎం.రాయుడు పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దును విరమించుకోవాలి

● సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య

కావలి టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):ఆప్కాస్ రద్దును ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు శనివారం నాలుగో డివిజన్ మస్టర్ పాయింట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు కార్మికులను అప్పజెప్పాలనే ఆలోచనలో ఉన్నారని, ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు.కార్మికుల ఎన్నికల హామీలు విస్మరించారని మండిపడ్డారు. సమస్యలు పరిష్కారానికి దశలవారీగా పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కృష్ణమోహన్, తురకా శీనయ్య, బాబు, రమే ష్, రమేష్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొండాపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శనివారం ప్రిన్సిపల్ షేక్ ఖాదర్‌బాషా తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఆధార్, ఏదైనా గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి ధ్రువీకరణ పత్రంతో ఈనెల 24 నుంచి మార్చి నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.75లు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

● ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి): వీరేపల్లి ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి చేరేందుకు ఈనెల 25 నుంచి మార్చి 31 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చని మండల విద్యాశాఖ అధికారి-2 ఎంవీ రమణయ్య శనివారం ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

భీమేశ్వరుడి వైభవంగా శేషవాహన సేవ


అలంకరణలో కామాక్షిదేవి, భీమేశ్వరస్వామి

సంగం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వంగల్లులో భీమేశ్వరస్వామి ఆలయంలో మహాశివ రాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి స్వామివారికి శేషవాహనసేవ వైభవంగా జరిగింది. ఈసందర్భంగా శ్రీ కామాక్షిదేవి సమేత భీమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను శేషవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు పూలంగిసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ

కావలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విశ్వోదయసేవా సమితి సభ్యులు శనివారం స్థానిక సమితి కార్యాలయంలో 60మంది నిరుపేద వృద్ధులకు రూ.60వేల విలువచేసే నిత్యావసరాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏరియావైద్యశాల సూపరింటెండెంట్ పద్మావతి మాట్లాడారు. విద్యాదాత డీఆర్ జ్ఞాపకార్థం ప్రతి నెలా ఆయన కుమారులు వినయ్‌కుమార్ రెడ్డి, విద్యాధర్‌రెడ్డిలు ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయం అని కొనియాడారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, సేవాసమితి డైరెక్టర్ కూనం తాతి రెడ్డి, సభ్యులు నల్లూరు రామకృష్ణ, సతీష్‌సింగ్, జేబీ నర్సింగ్ కళాశాల అధ్యాపకులు భాగ్యలక్ష్మీ, మౌనిక గ్రేసి పాల్గొన్నారు.

ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్త సేకరణ

ఉదయగిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):శకునాలపల్లి పంచాయతీలో శనివారం క్లాప్ మిత్రలు ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్త సేకరించారు. ఇన్‌చార్జి ఈవోపీ ఆర్డీ షేక్ కరీముల్లా మాట్లాడుతూ గ్రా మాల్లో ప్రజలు అందజేసిన తడి, పొ డి చెత్తను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలిం చడం జరుగుతుందన్నారు.

● దుత్తలూరు: దుత్తలూరు పంచాయతీలో క్లాప్‌మిత్రలు ఇంటింటికీ తి రిగి తడి, పొడి చెత్తను సేకరించారు. ఈ సందర్భంగా ఈవోపీ ఆర్డీ మల్లికార్జున్ మాట్లాడుతూ ప్రజలు ఇంటివద్దకు వచ్చే సిబ్బందికి, తడి, పొడి చెత్త అందజే యాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి షేక్ నజీ ముల్లా పాల్గొన్నారు.


చెత్త సేకరిస్తున్న క్లాప్‌మిత్రలు

లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

కావలి రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దచెరువు ఒడ్డున వెలసిన మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు మాధవరపు మాధవదాసు కుమారుడు మాల్యాద్రి స్వామి మాట్లాడారు. ఈ నెల 12న జరిగిన స్వామివారి కళ్యాణ మహోత్సవం అనంతరం ఈ 16 రోజుల పండుగ వేడుకలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. జక్కంపూడి మొహన్‌రావు, సుగుణమ్మ దంపతులు అన్నసంతర్పణ చేశారు.

ఏ సరుకులు ఎంత ఉన్నాయో తెలియదా?

● బుచ్చిలో అధికారులపై మంత్రులు నాదెండ్ల, ఆనం ఆగ్రహం


విద్యార్థులకు పంపిణీ చేసే పౌష్టికాహారం నాణ్యతను పరిశీలిస్తున్న మంత్రులు నాదెండ్ల, ఆనం, ఎంపీ వేమిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గోడౌన్‌లో ఉన్నదే నాలుగు రకాల సరుకులు.. అవి ఎంతెంత ఉన్నాయో కూడా తెలీదా? అని సివిల్ సప్లైస్ అధికారులపై రాష్ట్ర పౌరసరఫరాలశాఖామంత్రి నాదెండ్ల మనోహర్, దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక జెండాదిబ్బ వద్ద ఉన్న సివిల్ సప్లైస్ గౌడన్‌ను, సరుకులను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలసి తనిఖీ చేశారు. గోదాములోని బియ్యం, కందిపప్పు, చక్కెర, వంటనూనె, ఐసీడీఎస్‌కు సంబంధించిన పౌష్టికాహారంను పరిశీలించారు. ఇందులో సరుకుల్లో నాసిరకం, తూకాల్లో తేడాలు వెలుగుచూశాయి. బెల్లం పరిశీలించిన మంత్రులు అందులో కొరవడిన నాణ్యతను చూసి అవాక్కయ్యారు. అనంతరం స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. అందులోనూ తేడాలను గుర్తించి అధికారులను ప్రశ్నించగా ఒకరికొకరు చెప్పిన సమాధానాలకు పొంతన లేకపోవడంతో మండిపడ్డారు. డీఎస్‌వోని పిలిచి ఈ గోదామును ఎప్పుడైనా పరిశీలించారా అని ప్రశ్నించగా 3నెలల క్రితం పరిశీలించినట్టు చెప్పడం గమనార్హం. ఇలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని జేసీ కార్తీక్‌ను ఆదేశించారు. ముందుగా మంత్రులను కూటమి నాయకులు గజమాలతో సత్కరించారు.. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ డీఎం అర్జున్‌రావు, డీఎస్‌వో అంకయ్య, తహసీల్దారు వెంకటేశ్వర్లు, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కౌన్సిలర్లు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు. కాగా, బుచ్చికి 20 రేషన్ షాపులు మంజూరు చేయాలని మంత్రి మనోహర్‌ను చైర్‌పర్సన్ సుప్రజ కోరారు.

డాక్టర్ బిందుమీనన్‌కు ఓషియానియన్ ఎపిలెప్సీ అవార్డు


జాన్‌డబ్ల్యూ దునే చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ బిందుమీనన్

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అపోలో ఆసుపత్రి న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ బిందు మీనన్‌ను, ఆసియా ఓషియానియన్ అవుట్ స్టాండింగ్ అచీవ్‌మెంట్ ఎపిలెప్సీ అంతర్జాతీయ అవార్డును అందుకున్నారు. శనివారం ఢిల్లీలో 15వ ఆసియా ఓషియానియన్ ఎపిలెప్సీ సదస్సు జరిగింది. మూర్ఛవ్యాధి నివారణకు విశేషకృషి చేసిన ఆమెకు ఆసియా ఓషియానియన్ చైర్మన్ జాన్ డబ్ల్యూ దునే ఈ అవార్డును అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇండియన్ ఎపిలెప్సీ అసోసియేషన్ ప్రధానకార్యదర్శిగా కొనసాగుతున్న బిందుమీనన్ మూర్ఛవ్యాధిగ్రస్థుల సంరక్షణలో ముందుంటారని తెలిపారు. న్యూరాలజీ ఆన్‌వీల్స్ పేరుతో ప్రత్యేక వాహనం ద్వారా గ్రామాలకు వెళ్లి నిరుపేద మూర్ఛవ్యాధిగ్రస్థులకు వైద్య సేవలు అందించటం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని ఆమెకు ఈ అవార్డు అందచేశామని తెలిపారు.

కనుల పండువగా పెంచలోరి కల్యాణం


క్షేత్రోత్సవంలో స్వామి, అమ్మవార్లు

రాపూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన క్షేత్రంలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం అనంతరం ఉత్సవమూర్తులను అలంకార మండపానికి తీసుకొచ్చి తిరుచ్చిపై కొలువుదీర్చారు. ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్‌సేవ, నిత్య కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణ వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు.

పరిశుభ్రత మనందరి బాధ్యత : డీపీవో


ఇంటిలోని చెత్తను బండిలో వేస్తున్న డీపీవో శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : పల్లెటూళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యతని డీపీవో శ్రీధర్‌రెడ్డి సూచించారు. పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా శనివారం మండలంలోని కాకుపల్లిలో ఆయన పర్యటించారు. సర్పంచి కోసూరు సుభాషిణి, అధికారులతో కలిసి ఇంటింటి వెళ్లి చెత్తను సేకరించి బండిలో వేయించారు. అనంతరం మాట్లాడుతూ ఇంట్లోని చెత్తను వాకిట ముందుకు వచ్చే బండికి అందించాలని కోరారు. పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కోరారు.

ఆర్‌పీఐ పార్టీలో చేరిన బీజేపీ నాయకులు


ఆర్‌పీఐ పార్టీలో చేరిన దాసరి కమలాకర్ తదితరులు

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆర్‌పీఐ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే.మాబు ఆధ్వర్యంలో శనివారం బీజేపీ మీడియా విభాగానికి చెందిన దాసరి కమలాకర్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాబూ మాట్లాడుతూ కమలాకర్ ఆర్‌పీఐ పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. బీజేపీలో దళిత, ముస్లిం, బహుజనులకు రాజకీయంగా చోటు ఉండదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కమలాకర్ మాట్లాడుతూ దళితులను బీజేపీలో చాలా హేళనగా చూడడం, రాజకీయంగా ఎదుగుదల లేకపోవడాన్ని గమనించి ఆర్‌పీఐ పార్టీలో చేరానని తెలిపారు. కార్యక్రమంలో తాటిపర్తి ప్రభాకర్, పట్టపు రంగారావు, ముసలి జయరాజు, సీనియర్ సిటిజన్ కన్వీనర్ నిమ్మల సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో పరిశీలన


డ్రోన్ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బాలాజీనగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని హరనాథపురం ఎక్స్‌టెన్షన్ ప్రాంతం, ఎస్వీజీఎస్ కళాశాల పరిసర ప్రాంతాలు, నిర్మానుష్యంగా ఉండే ఇతర ప్రాంతాలను శనివారం నగర డీఎస్పీ సింధుప్రియ డ్రోన్ కెమెరాల ద్వారా పరిశీలించారు. అనంతరం ప్రజలకు సైబర్‌క్రైమ్, గంజాయి, నేరాలపై అవగాహన కల్పించారు. డ్రోన్ కెమెరాల పర్యవేక్షణ ద్వారా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చని ఆమె తెలిపారు. ఓపెన్ డ్రింకింగ్, పేకాట కేంద్రాలను డ్రోన్ కెమెరాలతో గుర్తించవచ్చన్నారు. ప్రజలు అసాంఘిక కార్యకలాపాలపై తమకు సమాచారం అందించాలని కోరారు.

శివరాత్రి ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జగదీష్‌నగర్ 3వవీధిలోని శ్రీ లక్ష్మీ గణపతి సుబ్రహ్మణ్యం, శారదాదేవి సమేత శివపార్వతుల ఆలయంలో శనివారం శివరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ జరిగింది. ముఖ్య అతిథిగా టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొని వీటిని ఆవిష్కరించారు. కార్పొరేటర్ వేనాటి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 26న శివరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతాయని వారు తెలిపారు.

● ఆదిశంకర ధ్యాన మందిరంలో..

నగరంలోని పొగతోటలోగల ఆదిశంకర ధ్యాన మందిరంలో ఈనెల 26 నుంచి మార్చి ఒకటి వరకు శివరాత్రి పూజలు జరుగుతాయని, భక్తులంతా తరలిరావాలని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వీరంపల్లిలో చెత్తబుట్టల పంపిణీ

మనుబోలు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరంపల్లి సచివాలయంలో శనివారం గ్రామస్థులకు చెత్తబుట్టలు పంపిణీ చేశారు. ఇన్‌చార్జి కార్యదర్శి అంకయ్య మాట్లాడుతూ స్వచ్ఛాంధ్రలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ తరపున 1039 చెత్తబుట్టలను కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుతం ఇంటికో బుట్ట ఇస్తున్నామని, త్వరలో మరో బుట్టను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పొట్టేళ్ల ప్రసాద్, మన్నారపు రఘురామయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేరుమారని పట్టణ ఆరోగ్య కేంద్రాలు

● ఇంకా కొనసాగుతున్న వైఎస్సార్ పేరు ● కలెక్టరేట్ పక్కనే కేంద్రం ఉన్నా పట్టించుకునే వారేరీ ?


కలెక్టరేట్ పక్కనే వైఎస్సార్ బోర్డు ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (సీపీహెచ్‌సీ)లో నిబంధనలు పాటించటం లేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చి 8 నెలలు పూర్తి కావస్తున్నా, ఆయా ఆరోగ్య కేంద్రాల పేరు.. వైఎస్సార్ సీపీహెచ్‌సీలుగానే కొనసాగుతున్నాయి. నగరంలోని 20 సీపీహెచ్‌సీలు వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలుగానే కొనసాగుతున్నాయి. కలెక్టరేట్ పక్కన ఉన్న కేంద్రం కూడా వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంగానే కొనసాగుతున్నది. ఇక మిగిలిన ఆరోగ్య కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి. ఇంతవరకు ఆయా బోర్డులు తొలగించాల్సి ఉన్నా, అలాంటి చర్యలు మాత్రం వైద్యశాఖ అధికారులు తీసుకోలేదు. వీటికి ఎన్టీఆర్ పేరు పెట్టాల్సి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఇవి అమలు అవుతున్నాయి. అయితే నగరంలో మాత్రం భిన్నమైన వాతావరణం నెలకొంది.

● అధికారుల దృష్టికి తీసుకెళ్లినా...

ఎన్నోసార్లు ఆయా పట్టణ ఆరోగ్య కేంద్రాలలో వైద్యఆరోగ్యశాఖాధికారులు పర్యటించారు. ఇక్కడ ఉన్న వైఎస్సార్ బోర్డులను తొలగించాలని స్థానిక ఆసుపత్రుల నిర్వాహకులు తెలియచేసినా, వారు పట్టించుకోలేదు. ఇదిలాఉంటే టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కూడా ఈ బోర్డుల కొనసాగింపుపై దృష్టి పెట్టలేదు. ఇప్పటికైనా పేరు మార్చాలని పలువురు కోరుతున్నారు.

పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీ

ముత్తుకూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : ముత్తుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత తనిఖీ చేశారు. మండలంలో ఏర్పాటైన తాళ్లపూడి పీహెచ్‌సీ స్థితిగతులు, వైద్య సేవలు ప్రారంభం కాకపోవడానికి అవరోధాల వివరాలపై ఆరా తీశారు. తాళ్లపూడి పీహెచ్‌సీ పరిధిలోని సిబ్బంది విధులు, రికార్డుల నిర్వహణపై సమీక్షించారు. రోగులకు అందిస్తున్న ఓపీ సేవలు, రక్త పరీక్షలు, కాన్పులు, తదితర అంశాలలో వరుసగా రెండు నెలలు ఏ గ్రేడ్ వచ్చి జిల్లాలో మొదటి ర్యాంక్‌లో ముత్తుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిలవడంతో వైద్యాధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ముత్తుకూరు వైద్యాధికారి దేవికృప, తాళ్లపూడి వైద్యాధికారి చందనప్రియ, సీనియర్ సహాయకులు శేషగిరిరావు, స్టాఫ్ నర్సులు మధురవాణి, పవిత్ర, ఆదిలక్ష్మి, ఫార్మసీ ఆఫీసర్ మమత, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపరచాలి

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పంచాయతీల జిల్లా కోఆర్డినేటర్ ఆంజని తెలిపారు. మండలంలోని చిన్నచెరుకూరులో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ని శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి శనివారం పంచాయతీలో చెత్తాచెదారాన్ని తొలగించాలని తెలిపారు. తాగునీరు కలుషితం కాకుండా వాటర్ ట్యాంక్‌లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగు కాలువల్లో పూడిక తీయించాలని, వేసవి కాలం వస్తున్న నేపథ్యంలో తాగునీటి సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అమె వెంట పంచాయతీ కార్యదర్శి విరిత, ఎంఆర్‌సీ సునీల్ ఉన్నారు.

శ్మశాన స్థలం పత్రాల కోసం ఆందోళన

తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): శ్మశానానికి కేటాయించిన స్థలానికి సంబంధించిన పత్రాలను ఇప్పించాలని కోరుతూ మండల పరిధిలోని కోడూరు పంచాయతీ కోనేటితోపు గిరిజనులు శనివారం శ్మశానం వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ శ్మశానికి స్థలం కేటాయించాలని ప్రభుత్వంతో అనేక పోరాటాలు చేసిన అనంతరం అదేగ్రామానికి చెందిన రొయ్యల రమణయ్య వద్ద గత వైసీపీ ప్రభుత్వంలో అధికారులు 50 సెంట్ల భూమిని కొనుగోలు చేసి శ్మశానానికి కేటాయించిందన్నారు. అయితే ఆ భూమికి సంబంధించిన పత్రాలు ఓ వైసీపీ నేత వద్ద ఉండటంతో ఎప్పుడు కబ్జాకి గురవుతుందోనన్న భయం కలుగుతుందన్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు స్పందించి శ్మశాన పత్రాలను ఇప్పించాలని కోరారు.

కల్యాణ వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : స్థానిక రామకృష్ణానగర్‌లో కొలువైవున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ 9వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. వివిధ పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'జ్ఞానజ్యోతి'తో చిన్నారుల సమగ్రాభివృద్ధి

పొదలకూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలోపు చిన్నారుల సమగ్రాభివృద్ధి కోసమే జ్ఞానజ్యోతి శిక్షణ ఇస్తున్నట్లు డీఆర్‌పీలు కె.శీనయ్య, కళ్యాణ్, ఆదినారాయణమ్మ, జ్యోతిలక్ష్మి, పద్మజ తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు స్థానిక జడ్పీ బాలికల హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

'క్రైస్తవులపై దాడి హేయం'

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): చర్చిలో ప్రార్థనలు చేసుకుంటున్న క్రైస్తవులపై కొందరు ఆకతాయిలు మద్యం సేవించి దాడి చేయడం హేయమని పలువురు క్రైస్తవ నాయకులు అన్నారు. శనివారం సాయంత్రం బుచ్చిలోని శాంతినగర్‌లో క్రైస్తవ ఐక్య నాయకులు దాడిలో గాయపడిన బాధితులను పరామర్శించారు. అనంతరం నిరసన తెలిపారు. క్రిస్టియన్ నాయకుడు భర్ణబాస్ మాట్లాడుతూ శాంతియుతంగా వున్న క్రైస్తవులు తిరగబడితే పరిస్థితులు వేరేగా ఉంటాయని హెచ్చరించారు. ఈ విషయం జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి ఆకతాయిలపై చర్యలు తీసుకున్నారన్నారు.

అసత్య ఆరోపణలు తగవు : టీడీపీ

కొడవలూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : తన ఉనికిని కాపాడుకునేందుకు గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చేసిన అక్రమాలు, దౌర్జన్యాలను మరిచి తమ నాయకులపై అసత్య ఆరోపణలు చేయడం తగదని టీడీపీ సీనియర్ నాయకుడు కరకటి మల్లికార్జున్, ఇరువూరి యోగానందరెడ్డి అన్నారు. మండలంలో నార్తురాజుపాలెంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రావెల్, ఇసుక, మట్టి, మద్యం మాఫియాకు అడ్డాగా మార్చిన నార్తురాజుపాలెంకు చెందిన వైసీపీ నాయకుడు నేడు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఆయన చేసిన అక్రమాలను ఎమ్మెల్యే దృష్టికి తెస్తామన్నారు.

రూరల్‌లో కోటంరెడ్డి సోదరులకు తిరుగేలేదు!

● వాళ్ల దగ్గరే రాజకీయం నేర్చుకోవాలి
● 'గడప గడపకు' ముగింపు సభలో ఎంపీ వేమిరెడ్డి


గడప గడపకు.. ముగింపు సభలో మాట్లాడుతున్న ఎంపీ వీపీఆర్, వేదికపై ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి తదితరులు

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : గడప గడపకు.. అనే నినాదం పుట్టిందే కోటంరెడ్డి కుటుంబంలోనని, నెల్లూరు రూరల్లో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డిలకు తిరుగేలేదని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. 40 రోజులపాటు నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 18 గ్రామాల్లో నిర్వహించిన 'గడప గడపకు గిరిధర్‌రెడ్డి' అనే కార్యక్రమం ముగింపు సందర్భంగా శనివారం పొట్టేపాళెంలో బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీపీఆర్ మాట్లాడుతూ నిరంతరం ప్రజల్లో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరించే కోటంరెడ్డి సోదరుల వద్దే రాజకీయం నేర్చుకోవాలని అన్నారు. ప్రస్తుతం ఎలాంటి ఎన్నికలు లేకపోయినా ప్రజల సమస్యలు తెలుసుకోవాలని, వారికి అండగా నిలవాలని గడప గడపకు... పేరుతో యాత్రను దిగ్విజయంగా నిర్వహించడం అద్భుతమన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు, లోకేష్ ఆశీస్సులతో గిరిధర్‌రెడ్డి రూరల్ ఎమ్మెల్యే కాబోతున్నాడని ఆయన పేర్కొన్నారు. రూరల్ ప్రజలు ఇప్పటికే ఆ దిశగా సిద్ధమయ్యారని చెప్పారు. ముందుగా నిర్వహించిన ర్యాలీలో ఎంపీ,ఎమ్మెల్యేలను గజమాలతో సత్కరించారు.

● వేదగిరి చైర్మన్‌గా అచ్యుత్ రెడ్డి?

కాగా వేదగిరి క్షేత్రం చైర్మన్‌గా ఇందుపూరు అచ్యుత్‌రెడ్డిని ఎంపిక చేసి, ప్రతిపాదనలు పంపామని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి, వేదగిరి మాజీ చైర్మన్ ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు అచ్యుత్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాకాణి వల్లే సర్వేపల్లిలో సమస్యలు

● ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

ముత్తుకూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కారణంగా నియోజకవర్గం సమస్యలమయంగా మారిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ముత్తుకూరు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తన వద్దకే 2500పైగా అర్జీలు వచ్చాయన్నారు. జిల్లా కలెక్టర్ వద్దకు వచ్చిన సమస్యలతో కలిపి 5,333 అర్జీలతో రాష్ట్రంలోనే సర్వేపల్లి నియోజకవర్గం సమస్యల్లో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఐదేళ్లలో దోచుకుని దాచుకోవడం తప్ప ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశారన్నారు. భూముల రీ సర్వే, పింఛన్లు, రేషన్‌కార్డులు, తదితర సమస్యలు పేరుకుపోయాయన్నారు. తాము అధికారంలోకి వచ్చాక సమస్యలను పరిష్కరించుకుంటూ వస్తున్నామన్నారు. నియోజకవర్గాన్ని గాలికి వదిలేసి ఆస్తులు పెంచుకున్న కాకాణి, ప్రతిరోజు తనపై రూ.కోట్లు దోచుకుంటున్నానంటూ విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ముత్తుకూరులో పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, నీలం మల్లికార్జునయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో వైసీపీ శ్రేణుల చేరిక

వెంకటాచలం : నెల్లూరు రూరల్‌లోని అల్లీపురంలోని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నివాసంలో పలువురు వైసీపీ నేతలు తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుంకాల దశరథ నాగేంద్రప్రసాద్ నాయకత్వంలో మండలంలోని చెముడుగుంటకు చెందిన సీనియర్ నేత కుంచె రమేష్ ఆధ్వర్యంలో 20 కుటుంబాలకుపైగా టీడీపీలో చేరాయి. వీరిలో చెముడుగుంట సర్పంచు పాముల రమణమ్మ, వార్డు సభ్యులు కుంచె శేషయ్య, భయ్యా శోభ, గెర్రె వెంకటయ్య, కత్తి బలరామయ్య, విజయ్, మేనపాటి ఉమ, యర్రబల్లి సునీల్, మొలకల సునీతమ్మ, కుంచె శివశంకరయ్య, కుంచె సురేష్ తదితరులు సోమిరెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, నేతలు కుంకాల శ్రీనివాసులు, దొడ్ల ఆశోక్, మధురెడ్డి, భయ్యా శివకుమార్, ఉక్కాల వినోద్, సుధాకర్, నారాయణ, ఫయాజ్, కుమార్, గుర్రం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో ఇష్టారాజ్యం!

విమర్శలు వస్తున్నా మారని అధికారుల తీరు

ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు


మార్కింగ్ ప్రకారం తొలగించని దుకాణాలు

విడవలూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): లోకాయుక్త ఆదేశాల మేరకు విడవలూరు పంచాయతీలో చేపట్టిన రోడ్డు మార్జిన్ ఆక్రమణల తొలగింపులో ఆర్‌అండ్‌బీ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రెవెన్యూ అధికారులు వేసిన మార్కింగ్ ప్రకారం కాకుండా వైసీపీ నాయకుల నుంచి తాయిలాలు తీసుకుని వారి అనుచరులకు సంబంధించిన కట్టడాలను తొలగించకుండా వదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై శనివారం స్థానిక టీడీపీ నాయకులు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ఫిర్యాదు చేశారు. వాస్తవానికి రోడ్డు మార్జిన్‌లో ఆక్రమణల తొలగింపునకు రెవెన్యూ అధికారులు దుకాణాలు, ఇళ్లకు మార్కింగ్ వేశారు. ఈనెల 18న నుంచి విడవలూరు సినిమాహాలు నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ఉన్న ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు. అయితే మార్కింగ్‌ను పాటించకుండా టీడీపీ సానుభూతిపరులు, కార్యకర్తలకు సంబంధించిన దుకాణాలను తొలగించిన అధికారులు వైసీపీ నాయకుల అనుచరుల దుకాణాలను తొలగించకుండా వదిలేశారు. ఇలా చేస్తే ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకి చెడ్డ పేరు వస్తుందని స్థానిక టీడీపీ నాయకులు అధికారులను నిలదీసినా పట్టించుకోలేదని తెలిసింది. ఇదిలా ఉండగా ఆక్రమణల తొలగింపును పర్యవేక్షిస్తున్న ఓ ఆర్‌అండ్‌బీ అధికారి విధులను గాలికి వదిలేసి ఓ వైసీపీ చోటా నాయకుడు వద్ద చేపలు, రొయ్యలు తాయిలాలుగా తీసుకుని ఓ అంగడి వద్ద వాటిని శుభ్రం చేయించటం చర్చనీయాంశం అయింది. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులు శ్రద్ధ కనబరిచి ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు.

శివరాత్రి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

● శ్రీనివాసులురెడ్డి, ఈవో
మూలాపేట మూలస్థానేశ్వరాలయం



నెల్లూరు (సాంస్కృతికం) : సుప్రసిద్ధ శైవక్షేత్రమైన నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయని, మార్చి 5 వరకు జరిగే ఈ ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి 30వేలకుపైగా భక్తులు హాజరవుతారని ఆలయ ఈవో ఏ. శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

? ఏర్పాట్లు ఎలా చేశారు.

! భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాం. తాగునీరు, టాయిలెట్స్ క్యూలైన్లు, ఏర్పాటు చేస్తున్నాం.

? అలంకరణలు పూర్తయ్యాయా

! : ఆలయంలో రంగవల్లులు తీర్చిదిద్దాం. వాహనాలకు రంగులు వేశాం. భక్తుల కోసం చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణలు పూర్తయ్యాయి.

? అధికారుల సహకారం

! : మంత్రులు ఆనం రామనారాయ ణరెడ్డి, నారాయణల సూచనలు,సలహాలు ఇస్తున్నారు. ఫెస్టివల్ అధికారి కే జనార్దన్‌రెడ్డితోపాటు నగర పాలక సంస్థ, పోలీసు, విద్యుత్ , రెవెన్యూ, అగ్నిమాపకశాఖ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులంతా సంపూర్ణ సహకారం అందిస్తున్నారు.

? శివరాత్రికి ఏర్పాట్లు

! ఈ నెల 26న మహాశివరాత్రికి భక్తుల రద్దీ ఉంటుంది. అందుకుగాను మూడు క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నాం. తాగునీటి సీసాలతోపాటు ఉచిత ప్రసాదాలు అందజేస్తున్నారు. 28న జరిగే రథోత్సవం ఈ సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు, రోప్ పార్టీలను ఏర్పాటు చేయనున్నాం.

స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో పాల్గొనండి

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మున్సిపాలిటీల్లోని పారిశుధ్య పరిస్థితులపై నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో నగర ప్రజలు పాల్గొని, నెల్లూరుకు మంచి ర్యాంకులు వచ్చేందుకు దోహదపడాలని నగర కమిషనర్ సూర్యతేజ శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఓట్ ఫర్ వెబ్, ఓట్ ఫర్ క్యూఆర్ కోడ్ పేరిట పోస్టర్లను ప్రచారంలోకి తీసుకొచ్చామన్నారు. ఈ సర్వేలో ప్రతీ పౌరుడు తన స్పందనను తెలియచేయాలని కోరారు.

ఇస్తిమా సదస్సులో ప్రముఖులు

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నార్తురాజుపాలెంలో శనివారం జరిగిన ఇస్తిమా సదస్సులో నగరానికి చెందిన ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు. డిప్యూటీ మేయర్ తహసీన్, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ చీఫ్ జనరల్ సెక్రటరీ ఇంతియాజ్, 42, 43 డివిజన్ల టీడీపీ నాయకులు జాకీర్, తదితరులు పాల్గొన్నారు. అక్కడ జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వారు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆదెమ్మ సత్రం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు శనివారం కంటి పరీక్షలు నిర్వహించారు. 11 మందికి కంటి సంబంధిత సమస్యలు గుర్తించి కళ్ల అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్‌కుమార్, ఆప్తమాలిక్ వైద్యురాలు శశికళ, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ ఎం.సుబ్బయ్య, ఉపాధ్యాయులు జి.శేఖర్, కె.రేణుక, కె.శారద, తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాగాంధీకి ఘన నివాళి

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో శనివారం మహాత్మా గాంధీ ధర్మపత్ని కస్తూర్బాగాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గంపల మంజుల, తదితరులు కస్తూర్బాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ఆశ్రమ మేనేజర్ మనోజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థినుల ఎంపిక

వెంకటాచలం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొలగమూడి సమీపంలో ఉన్న మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వీవీ రమణప్రసాద్ తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థినులు రిషిత, సింధు, యమున, లాస్య, పల్లవి, జెస్సికాలను శనివారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు జీ తేజోకుమారి, ఏ దీపిక, డీ తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు


- హాజరుకానున్న 5,801 మంది అభ్యర్థులు
- కంట్రోల్ రూమ్ నెంబరు 7032157040



పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న అధికారులు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలకు యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. తిరుపతి కేంద్రంగా 13 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 5,801మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వారి సౌకర్యార్థం తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, 7032157040ను కేటాయించారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ నేతృత్వంలో పేపర్-1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు జరుగనున్నాయి. మొబైల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు. బస్టాండు నుంచి కేంద్రాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఇతర అధికారులు శనివారం పరిశీలించారు.

నేడు రేణిగుంటకు సీఎం చంద్రబాబు రాక



తిరుపతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదివారం రేణిగుంటకు రానున్నారు. అక్కడ జరిగే టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ కుమారుడి వివాహానికి హాజరుకానున్నారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 10.50 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ పరిధి తుడా రోడ్డులో ఉన్న ఆర్‌పీఆర్ ఫంక్షన్ హాల్ చేరుకుంటారు. అక్కడ వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించనున్నారు. 11.30 గంటలకు వెనుదిరిగి ఎయిర్ పోర్టు చేరుకుని హెలికాప్టర్‌లో నెల్లూరు జిల్లా కనపర్తిపాడు వెళతారు. అక్కడ జరిగే ఓ వివాహ వేడుకలకు హాజరై తర్వాత ఉండవల్లిలోని తన నివాసానికి వెళతారు. సీఎం రాక సందర్భంగా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. శనివారం విమానాశ్రయం నుంచి కళ్యాణ మండపం వరకు ట్రయల్ రన్ నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు పలు పర్యాయాలు ఎయిర్‌పోర్టు, అక్కడి నుంచి ఫంక్షన్ హాలు వెళ్లే మార్గం, ఫంక్షన్ హాలును పరిశీలించి భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు.

యంత్రాలతో తోడేస్తున్నారు

స్వర్ణముఖిలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు

టిప్పర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్న మాఫియా



ఎక్స్‌కవేటర్ సాయంతో ఇసుకను తవ్వి టిప్పర్‌లో నింపుతున్న దృశ్యం

రీచ్‌లు లేకున్నా.. ఎక్కడైనా ఇసుక తీసుకోవచ్చు. అయితే, మనుషులతో తవ్వి ట్రాక్టర్లలో మాత్రమే ఉచితంగా తీసుకెళ్లాలి. ఇదీ రాష్ట్ర ప్రభుత్వ ఉచిత ఇసుక విధానంలో నిబంధన. దీనిని కొందరు ఉల్లంఘిస్తున్నారు. యంత్రాలతో ఇసుక తవ్వి.. పెద్దపెద్ద టిప్పర్లలో ఇసుక తరలించేస్తున్నారు.

\- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి

ఎక్స్‌కవేటర్లు, హిటాచీలు చేసే శబ్దాలు. ఒక్కొక్కటిగా వచ్చే టిప్పర్లు. ఇవీ తిరుపతి రూరల్ మండలంలోని స్వర్ణముఖీ నది పరివాహక ప్రాంతంలో కనిపించే దృశ్యాలు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వి తరలించేందుకు జరిగే పనులివి. నదిలోని ఇసుకను తవ్వితీసి నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్లలో నింపుకుని తరలించి అందినకాడికి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక మంచి ఇసుక దొరికేచోట్ల పరిధికి మించి జేసీబీ సాయంతో తవ్వేస్తుండడంతో నది రూపురేఖలు కోల్పోతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా పేట్రేగిపోయిన ఇసుక మాఫియా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా అదే తరహాలో ఇష్టారాజ్యంగా రేయింబవళ్లు ఇసుక తోడేసి అనధికారికంగా విక్రయిస్తున్నా మైనింగ్, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజల అవసరాల కోసం ట్రాక్టర్ల ద్వారా మనుషులతో తవ్వి.. ఇసుకని ఉచితంగా తీసుకెళ్లేందుకు అనుమతినిచ్చింది. ఇసుక రీచ్‌లు లేని చోట్ల నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేసి అక్కడ నుంచి కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టారు. దీన్ని బేఖాతరు చేస్తూ అనధికారికంగా యంత్రాల సాయంతో ఇసుక తోడేస్తున్నారు. చిగురువాడ గ్రామ దక్షిణపుకం డ్రిగ రెవెన్యూ లెక్కదాఖలాలో సి.గొల్లపల్లె నుంచి దుర్గ సముద్రం గ్రామానికి వెళ్లే లింకురోడ్డుకు తూర్పు దిశగా, సర్వే నంబరు219కు దక్షిణం వైపు స్వర్ణముఖి నదిలో విచ్చలవిడిగా తవ్వకాలు చేపడుతున్నారు. అలాగే గొల్లపల్లె, దుర్గసముద్రం, పైడిపల్లె, అడపారెడ్డిపల్లె, కేసీ పేట, తనపల్లె తదితర పంచాయతీల్లో నదిలోకి దారులను ఏర్పాటు చేసుకుని టిప్పర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారని సమాచారం. ఈ నది పరివాహక ప్రాంతంలో గతంలో కొందరు పేదలకు నియమ, నిబంధనల మేరకు సాగు చేసుకునేందుకు లీజు పట్టాలను మంజూరు చేశారు. దీనిలో ఇసుక తరలించేందుకు ఎలాంటి హక్కులూ కల్పించలేదు. కొందరు ఇదే అదునుగా తప్పుడు రికార్డులు సృష్టించుకుని, ఈ భూమిపై తాము హక్కు కలిగి ఉన్నామని చెబుతూ.. ఎక్స్‌కవేటర్ల సాయంతో ఇసుకను తవ్వితీసి అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు. పట్టపగలే యథేచ్ఛగా ఇసుకను టిప్పర్ల ద్వారా అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నా పట్టించుకునేవారు కరువయ్యారని గ్రామస్తులు అంటున్నారు. కాగా వైసీపీ ప్రభుత్వంలో అప్పటి పాలకులు ఇక్కడ ఇసుక రీచ్‌ని పెట్టేందుకు ప్రయత్నించగా స్థానికులతోపాటు సమీపంలోని గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. అలాగే స్వర్ణముఖి నదీ పరివాహక ప్రాంతంలో ఇసుక తరలింపును నిషేధించాలని చిగురువాడ గ్రామసభల్లోనూ ప్రత్యేక తీర్మానం చేశారు. జలవనరులు, భూగర్భశాఖ అధికారులు ఈ ప్రాంతాన్ని డ్రౌట్ ఏరియాగా గుర్తించినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే నదిలోని ఇసుకుని ఇదేవిధంగా తరలిస్తూ పోతే రానున్న రోజుల్లో నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని, దీన్ని ప్రభుత్వ భూమిగా గుర్తించాలని కోరుతున్నారు. అలాగే నదిప్రాంతంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి నియమ, నిబంధనల మేరకే ఇసుకను ఉచితంగా తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యంత్రాలతో తవ్వితే చర్యలు

ఎక్కడి నుంచైనా ఇసుక తీసుకోవచ్చు. మనుషులతో మాత్రమే తవ్వుకుని ట్రాకర్ల ద్వారా తీసుకెళ్లాలి. యంత్రాలతో నదిలోని ఇసుకని తవ్వితీసి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో స్థానిక రెవెన్యూ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడైనా యంత్రాల సాయంతో ఇసుక తవ్వుతున్నారని తెలిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడేదిలేదు.

\- రామాంజులునాయక్, తిరుపతి రూరల్ తహసీల్దార్

నేత్రపర్వం శివయ్య ధ్వజారోహణం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేదపండితులు



పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన స్వామివారి ధ్వజారోహణం శనివారం భక్తుల మధ్య నేత్రపర్వంగా సాగింది. ఉత్సవాల్లో రెండవ రోజు శనివారం ఉదయం స్వామి అమ్మవార్ల మూలమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.బేరి పూజతో మంత్రజలాలను ఆలయంలో చల్లుతూ శుద్ధి చేశారు.అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అలంకరించారు. హారతులు సమర్పించి స్వామి అమ్మవార్ల తొలి ఊరేగింపు ప్రారంభించారు. శివయ్య గోపురం, రాజగోపురం మీదుగా దేవాంగ వాహనాల వద్దకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి స్వామి,అమ్మవారు వెండి అంబారి వాహనంపై ఆశీనులయ్యారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ పార్వతీ పరమేశ్వరుల పురవిహారం అంగరంగ వైభవంగా సాగింది. వేల సంఖ్యలో భక్తులు హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.కాగా ధ్వజారోహణం సందర్భంగా భక్తులు 4,508 కొడిచీరలను సమర్పించారు.

శాస్త్రోక్తంగా దర్భ ప్రదక్షిణ

అంబారి సేవ అనంతరం ధ్వజారోహణ మహోత్సవానికి అవసరమైన దర్భ, మామిడాకులు, దవళ పతాకాన్ని శాస్త్రోక్తంగా ఆలయంలో ప్రదక్షిణ చేయించారు. చతుర్మాడ వీధుల్లో కొలువైన నవసంధి వినాయకాలయాల వద్దకు తీసుకువచ్చి పూజలు చేశారు. అనంతరం దర్భను ఆలయంలోకి చేర్చారు.

అంగరంగ వైభవంగా పంచమూర్తుల ఊరేగింపు

శివ పరివార దర్శనం నేత్రపర్వంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం, రాత్రి రెండుసార్లు పంచమూర్తుల ఊరేగింపు నిర్వహించారు. ముందుగా శివ పరివారమైన వినాయక స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, భక్త కన్నప్ప, చండికేశ్వరుడు, స్వామి అమ్మవార్లు వెండి అంబారీలపై అధిరోహించి ఊరేగింపుగా సాగారు.



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

స్వర్ణతాపడ ధ్వజస్తంభానికి దర్భధారణ

స్వామివారి సన్నిధి ఎదురుగా ఉన్న స్వర్ణతాపడ ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఇందులో భాగంగా దేశకాల సంకీర్తన, గణపతిపూజ, కలశ ఆవాహన, పుణ్యాహవచనం, కలశ ఆరాధన, రక్షాబంధనాలను వేదమంత్రోచ్చారణలతో వైభవంగా నిర్వహించారు. స్వర్ణ తాపడ ధ్వజస్తంభానికి దర్భధారణ చేశారు. అనంతరం భక్తులు సమర్పించిన కొడి చీరలు, దవళపతాకం, మామిడి ఆకులు ధ్వజస్తంభానికి ఎగురవేసి, దేవతలకు ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ, టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు, విజయకుమార్ పాల్గొన్నారు.

నేడు భూత, శుక వాహన సేవలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఒక్కో రాత్రిని ఒక్కో పేరుతో పిలుస్తారు. ఆదివారం భూతరాత్రిని పురస్కరించుకుని భూత గణాలకు ఆధిపత్యం వహిస్తున్న పరమేశ్వరుడు భూత వాహనంపై, ఆయన దేవేరి జ్ఞానప్రసూనాంబిక చిలుక వాహనంపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దివ్యదర్శనం ఇవ్వనున్నారు. ఉదయం సూర్యప్రభపై స్వామి వారు, చప్పరంపై అమ్మవారు ఊరేగనున్నారు.

గరుడుడిపై కల్యాణ వెంకన్న

- జనసంద్రమైన శ్రీనివాసమంగాపురం



చంద్రగిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : శ్రీనివాస మంగాపురంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి గరుడోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో శ్రీనివాసమంగాపురం జనసంద్రమైంది. ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన సేవలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తిని వాహన మండపానికి తీసుకొచ్చి పట్టు పీతాంబరాలు, బంగారు ఆభరణాలతో మోహినీ అవతారంగా అలంకరించి పల్లకిపై అధిష్టించారు. తిరుచ్చి వాహనంపై నవనీత కృష్ణుడు రక్షణగా ఆలయ తిరుమాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి 8 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తిని వాహన మండపానికి తీసుకొచ్చి పట్టు పీతాంబరాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి గరుడ వాహనంపై అధిష్ఠింపజేశారు. అనంతరం ఆలయ తిరుమాడ వీధుల్లో అశ్వ, వృషభ, గజరాజులు ఠీవీగా నడుస్తుండగా చెక్క భజనలు, కోలాటాలు, పిల్లంగట్లు, కేరళ వాయిద్యాల నడుమ భక్తుల గోవిందనామ స్మరణలతో కీర్తిస్తుండగా స్వామివారు దర్శనమిచ్చారు. శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామికి తిరుమల శ్రీవారి ఆలయం నుంచి తీసుకొచ్చిన శ్రీలక్ష్మీకాసుల హారాన్ని టీటీడీ పరిపాలన భవనం నుంచి శోభయాత్రగా శ్రీనివాసమంగాపురం ఆలయానికి తీసుకొచ్చి స్వామి వారికి అలంకరించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

తుడా టవర్స్ వేలానికి సిద్ధం

- మార్చి 8 నుంచి ప్రారంభం
- వీసీ మౌర్య వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న వీసీ మౌర్య

తిరుపతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : తిరుపతి పట్టణాభివృద్ధి సంస (తుడా) ప్రతిష్టాత్మకంగా తిరుపతిలో నిర్మిస్తున్న తుడా టవర్స్‌ను వేలానికి సిద్ధం చేస్తున్నారు. మార్చి 8వ తేదీ నుంచి వేలం నిర్వహిస్తున్నామని తుడా వీసీ ఎన్.మౌర్య తెలిపారు. తుడా కార్యాలయంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ నగరంలోని రాయలచెరువు రోడ్డులో 13 అంతస్థులలో తుడా టవర్స్ నిర్మాణం జరుగుతోందన్నారు. గ్రౌండ్, ఒకటో అంతస్థుల్లో 27 దుకాణాలతో వాణిజ్య సముదాయాలు, రెండు, మూడు, నాలుగు అంతస్థులలో ఆఫీస్‌ల వినియోగానికి, మిగిలిన అంతస్థుల్లో నివాస యోగ్యంగా 2, 3, 4 బెడ్ రూమ్ ఫ్లాట్స్ నిర్మాణం జరుగుతోందని పేర్కొన్నారు. మొత్తం 250 ఫ్లాట్లు ఉంటాయని, అందులో 46 డబుల్ బెడ్ రూమ్స్, 152 ట్రిపుల్ బెడ్ రూమ్స్, 32 నాలుగు బెడ్ రూమ్స్ ఫ్లాట్లు ఉంటాయన్నారు. విశాలమైన పార్కింగ్, వాణిజ్య సముదాయాలు, ఫ్లాట్లకు వేర్వేరుగా లిఫ్టులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 2026 మార్చిలోపు అన్ని పనులు పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామన్నారు. ఇందులో భాగంగా మార్చి 8వ తేదీ నుంచి అన్ని అంతస్తుల విక్రయానికి వేలం నిర్వహించనున్నామని తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు తుడా వెబ్‌సైట్‌లో, కార్యాలయంలోని రిసెప్షన్ సెంటర్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. మార్చి 8న 2, 3 అంతస్తులకు, 9వ తేదీ 4, 5 అంతస్తులకు, 10వ తేదీ 6, 7 అంతస్తులకు, 11వ తేదీ 8, 9 అంతస్తులకు, 12వ తేదీ 10, 11 అంతస్తులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకు వేలం నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో తుడా కార్యదర్శి వెంకట నారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర పాల్గొన్నారు.



స్కూలు బస్సుల తనిఖీ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా స్కూలు బస్సులను రవాణా, పోలీసు అధికారులు శనివారం తనిఖీ చేశారు. ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాల మేరకు తిరుపతి, పుత్తూరు, సూళ్లూరుపేట తదితర ప్రాంతాల్లో డీఎస్పీలు రవికుమార్, చెంచుబాబు ఆధ్వర్యంలో సీఐలు, ఎస్‌ఐలు, రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. వాహనాల ఫిట్‌నెస్‌ను పరిశీలించారు. వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డ్రైవర్లకు సూచనలు చేశారు. లైసెన్సు లేకుండా నడిపినా, పర్మిట్‌లు లేకున్నా వాహనాలను సీజ్ చేయాలని ఎస్పీ ఆదేశించారు. 40 కిలోమీటర్ల వేగ పరిమితి మించరాదన్నారు. స్కూలు యాజమాన్యాలు తరచూ డ్రైవర్లపై నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, రవికుమార్, పుత్తూరు ఎంవీఐ చంద్రశేఖర్, అనిల్‌లు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తూ సంబరాలు చేసుకుంటున్న కవలలు

కనులపండువగా కవలల వేడుక

ప్రపంచ కవలల దినోత్సవం సందర్భంగాశనివారం స్థానిక వేమన విజ్ఞాన కేంద్రంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. తిరుపతి, చిత్తూరు, పుత్తూరు, రేణిగుంట, శ్రీకాళహస్తి, నగరి, కడప, మదనపల్లి, కర్నూలు హైదరాబాద్, గద్వాల్, బెంగళూరు నుంచి కవలలు హాజరయ్యారు. చిన్నారుల నుంచి పెద్ద వయసు వరకు ఉత్సవాల్లో పాలుపంచుకున్నారు. భారీ కేక్‌కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ర్యాంపువాక్‌తో కొందరు ఆకట్టుకున్నారు. డ్యాన్సులతో హోరెత్తించారు. వినసొంపైన గాత్రకచేరీలతో మైమరపించారు. ం క్రీడల్లో ప్రతిభ చాటిన వారికి, ప్రాతినిథ్యం వహించిన బహుమతులు ప్రదానం చేశారు. 80 కవల జంటలు కనువిందు చేశారు. సీయూ నెక్స్ట్ ఇయర్ అంటూ బరువైన హృదయంతో ఎవరిదారిన వారు వెళ్లిపోయారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి



చిన్నారి సాహస విన్యాసం

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని 23 కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లలతో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం : రూ.3.52 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 65,327

తలనీలాలు సమర్పించినవారు : 22,804





పల్లికొండేశ్వరాలయం

పరమశివుని అరుదైన దివ్య రూప సందర్శనం నాగలాపురం మండలం సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో వీక్షించవచ్చు. శంకరుడు అన్నీ ఆలయాల్లోనూ లింగాకార రూపంలోనే దర్శనమిస్తాడు. ఇక్కడ మాత్రం పార్వతీ ఒడిలో 14 అడుగుల మానుష రూపంలో శివశయనమూర్తిగా అనుగ్రహమిస్తాడు. పార్వతీ సమేతంగా యోగనిద్రలో దర్శనమిచ్చే ఈ పరమేశ్వరుడుని దర్శించుకుంటే తమ కోరికలు శీఘ్రంగా నెరవేరుతాయని భక్తులు ప్రగాఢంగా విశ్వశిస్తారు.

- నాగలాపురం, ఆంధ్రజ్యోతి

యోగ నిద్రామూర్తి

సురుటుపల్లి పల్లికొండేశ్వరుడు

స్థల పురాణం

ఆలయానికి సంబంధించి స్థల పురాణం ఇలా ఉంది. దేవతలె అమృతంకోసం క్షీర సాగర మధనం చేసినప్పుడు పాల సముద్రం నుంచి కాలకూట విషం వెలువడుతుంది. లోక కళ్యాణార్థం శివుడు దానిని స్వీకరిస్తాడు. విషాన్ని గర్భంలోకి చేరకుండా పార్వతీ దేవి తమ పతి గొంతును నొక్కి పడుతుంది. దీంతో గొంతు భాగం నీలి రంగుగా మారుతుంది. అందుకే శివుడ్ని నీలకంఠుడంటారు. విష ప్రభావానికి లోనైన స్వామి భరించలేని తాపంతో పార్వతి ఒడిలో సేదదీరాడు. శివశయన మూర్తికి ఏర్పడిన స్థితికి చింతిస్తూ సకల దేవతలు వచ్చారు. ఆ రోజు త్రయోదశి మంగళవారం సాయంకాలం ప్రదోష వేళలో మహాదేవుడు విషాహరణ దుస్థితిని వీడాడు. తన కమల నేత్రములను వికసింపజేసి గౌరీ సమేతంగా భక్తులకు అనుగ్రహించాడు. అందుకే క్షేత్రంలో ఆమె పేరు సర్వమంగళా దేవి. సురుటుపల్లి పల్లికొండేశ్వర క్షేత్రం ప్రదోష క్షేత్రంగా వాసికెక్కింది.



వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు...

ఆలయంలో ఏటా 10రోజుల పాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. దేవదాయశాఖ నిధులతో పాలకమండలి ఛైర్మన్, ఆలయ ఈవో నేతృత్వంలో చలువపందిళ్లు, విద్యుత్ దీపాలంకరణలు, క్యూలైన్లు, తాగునీటి వసతులు, పుష్పాలంకరణ వంటివి ఏర్పాటు చేస్తారు. పల్లకి ఉత్సవం, చంద్రప్రభా వాహనం, కామదేను వాహనం, భూతవాహనం, అధికార నంది వాహనం, గజవాహనం, అశ్వవాహనం, వృషభ వాహనం, కల్పవృక్ష వాహనం, రావణాసుర వాహనాల్లో స్వామి అమ్మవారికి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఈనెల 26నమహాశివరాత్రి పూజలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. అలాగే 15 రోజలకోసారి ప్రదోష వేళలో ప్రదోష మహానందికి అభిషేకాది పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తారు.

పేరిలా వచ్చింది..

విష్ణు బ్రహ్మాది సురులు వచ్చినందున సురులపల్లిగా పిలిచేవారు. కాలక్రమేనా సురుటుపల్లిగా మారింది. విజయనగరాధీశుడు హరి హర బుక్క రాయులు క్రీ.శ. 1344-47 లో పల్లికొండేశ్వరుడు నిర్మించారు. పార్వతీ పరమేశ్వరులు ప్రదోష వేళలో సర్వలోకాలను అనుగ్రహించడం వలన ఈదేవాలయం మహాప్రదోష క్షేత్రంగా ప్రసిద్ధిగాంచింది.




పరీక్షా కాలం... ఆరోగ్యం ప్రధానం

- మంచి ఆహారం... నిద్ర తప్పనిసరి
- జాగ్రత్తలు సూచిస్తున్న నిపుణులు

విద్యార్థులకు పరీక్షల సమయం దగ్గర పడింది. ఇంటర్‌మీడియట్, పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. మార్చి 1 నుంచి ఇంటర్, 17 నుంచి పదవ తరగతి పరీక్షలు జరుగనున్నాయి. దీంతో రాత్రి, పగలు విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. రేయింబవళ్లు చదువుకే కేటాయిస్తున్నారు. సమయానికి ఆహారం, చాలినంత నిద్ర గురించి పట్టించుకోకుండా బిజీ అయిపోతున్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలంటే అభ్యాసంతో పాటు ఆహారం, ఆరోగ్యం ప్రధానమని విద్యా నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఒత్తిడిని అధిగమిస్తేనే ఏకాగ్రతతో చదువు సాగించగలమని సూచిస్తున్నారు.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి



సాత్వికాహారం ఎంతో మేలు

చదివినవి బాగా గుర్తుండాలన్నా, ఏకాగ్రతగా చదవాలన్నా త్వరగా జీర్ణమయ్యే సాత్విక ఆహారం ఎంతో మంచిదని నిపుణులు చెబుతురు. సాత్వికాహారంలోనూ పరిశుభ్రత, సమతుల పోషక విలువలు ఉండేలా చూడాలి. నిర్దేశిత సమయమూ పాటించాలి. మసాలా ఆహారం దరిచేరనివ్వకూడదు. వీధుల్లో విక్రయించే ఫాస్ట్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి. కాచి చల్లార్చిన నీటిని రోజుకు నాలుగు లీటర్ల వరకు తీసుకోవాలి. అన్నం లేదా బార్లీ గంజిని సాయంత్రం వేళల్లో తీసుకోవడం మంచిది. విద్యార్థులు రోజుకు 300 మిల్లీ లీటర్ల కొబ్బరి నీరు, గ్లూకోజ్ నీరు, కొద్దిగా ఉప్పు కలిపిన మజ్జిగ వంటివి తీసుకోవడం ఉత్తమం. శీతల పానీయాలు తాగకూడదు. రోజుకు అరగంటైనా వ్యాయామం చేయాలని సూచిస్తున్నారు.



పరిశుభ్రతతో ఉత్సాహం

శరీర, పరిసరాల పరిశుభ్రత ఉత్సాహాన్నిస్తుంది. చదువులో నిమగ్నమై స్నానం నిర్లక్ష్యం చేయకూడదు. శరీరం శుభ్రంగా ఉన్నపుడు మంచి మూడ్‌తో... చదివినది మెదడులో నిక్షిప్తమవుతుంది. అలసట వస్తే చల్లటి నీటితో ముఖం కడుక్కోవాలి. రెండు పూటలా స్నానం చేయాలి. లేదంటే చర్మం పొడిబారి చర్మవ్యాధులు వస్తాయి. దీనివల్ల ఏకాగ్రతకు భంగం కలుగుతుంది.



నిద్రతో ఉపశమనం

అలసిన శరీరానికి నిద్ర ఉపశమనం కలిగిస్తుంది. చాలినంత నిద్ర మరో రోజుపాటు చదువుకోడానికి కావలసిన ఉత్సాహాన్నిస్తుంది. చాలినంత నిద్ర లేకుండా చదవడం అనారోగ్యానికి దారితీస్తుంది... ఏకాగ్రత లేకుండా చేస్తుంది. అందువల్ల రోజూ 8 గంటలు నిద్ర ఉండేలా చూసుకోవాలి. ఎక్కువసేపు మేల్కొని చదివేందుకు కాఫీ, టీలు అతిగా తీసుకోవడం మంచిది కాదు. సోయాబీన్ పిండి కలిపిన మజ్జిగ తాగితే మంచి శక్తిని ఇవ్వడంతోపాటు పగటి నిద్రను నిరోధిస్తుంది. రాత్రి 10 గంటలసయంలో పాలు తాగితే ఆరోగ్యంతోపాటు నిద్రకూ ఉపకరిస్తుంది.



ఆహార నియమావళి

విద్యార్థులు ఇప్పటినుంచే ఆహార నియమావళి అలవరచుకోవాలి. మూడు పూటలా ఆహారం తీసుకోవాలి. ఏపూటా ఆహారాన్ని స్కిప్ చేయకూడదు. సమతుల ఆహారం తీసుకోవాలి. ఒమేగా 3 ఫాటీ యాసిడ్స్, విటమిన్ బి, జింక్ జ్ఞాపక శక్తిని పెంపొందిస్తాయి. రోజువారీ ఆహారంలో ఆకు కూరలు, కోడిగుడ్లు, పండ్లు, పిస్తా, ఆల్మండ్ తదితర నట్స్ ఉండేలా చూసుకోవాలి. పరిమితి మేరకు డార్క్ చాక్లెట్స్ తీసుకోవచ్చు... ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్స్ మెదడును ఉత్తేజితంగా ఉంచుతాయి. బార్లీ జావ మేలు చేస్తుంది.

- కేవీఆర్వీ ప్రసాద్‌రావు, డైటీషియన్, రుయా ఆసుపత్రి, తిరుపతి.

ఎస్వీయూ దూరవిద్యా పరీక్షలు వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 24నుంచీ నిర్వహించవలసిన దూరవిద్యా పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ నెల 24 నుంచీ మార్చి 15 వరకూ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉద్యోగులకు విధులు కేటాయించారు. చాలా మంది ఉద్యోగులు దూరవిద్యా పరీక్షలకు హాజరు కావలసి ఉంది. దీంతో పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. పరీక్షల నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తామని ఎస్వీయూ దూరవిద్యా విభాగ డైరెక్టర్ తవమణి తెలిపారు.

సౌత్‌జోన్ స్పోర్ట్స్ స్టైఫండ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) సౌత్‌జోన్ స్పోర్ట్స్ స్టైఫండ్ కోసం ఉత్తమ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్‌సాహెబ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన పట్టణ, గ్రామీణ క్రీడాకారులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎఫ్‌సీఐ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించి, మార్చి 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

- **బాలురు(15నుంచి 18 సంవత్సరాల వరకు):** ఫుట్‌బాల్, హాకీ, క్రికెట్
- **బాలికలు(18నుంచి 24 సంవత్సరాల వరకు) :** టేబుల్ టెన్నిస్, బాల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్

- తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి

బాలికపై అత్యాచారం

రేణిగుంట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన శనివారం గాజులమండ్యం పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తూకివాకం పంచాయతీ పరిధిలో నివాసముంటున్న పవన్(35) శనివారం ఉదయం ఓ 12 ఏళ్ల బాలికపై అత్యాచారానికి ఒడికట్టాడు. కూలి పనులకు వెళ్లొచ్చిన తల్లికి బాలిక ఈ విషయాన్ని తెలిపింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పవన్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. సీఐ మురళీకృష్ణ కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

వర్మీకంపోస్టుతో పంచాయతీలకు ఆదాయం : డీపీవో

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 774 గ్రామ పంచాయతీల్లో ఇంటి నుంచి చెత్త సేకరిస్తున్నామని, తడి చెత్త-పొడిచెత్తపై మహిళలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని జిల్లా గ్రామపంచాయతీ అధికారి సుశీలాదేవి తెలిపారు. శనివారం జిల్లాలో తడిచెత్త-పొడిచెత్త వేరు చేయడంపై అన్ని గ్రామ పంచాయతీల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డీపీవో పలు గ్రామ పంచాయతీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేకరించిన తడిచెత్త, పొడిచెత్త ద్వారా చెత్త సంపద కేంద్రాల్లో వర్మీకంపోస్టు తయారు చేస్తున్నామన్నారు. వాటిని ప్రజలకు విక్రయిస్తున్నామన్నారు. గడచిన నాలుగు నెలల్లో వర్మీకంపోస్టు విక్రయం ద్వారా పంచాయతీలకు రూ.7.20లక్షల ఆదాయం చేకూరిందన్నారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.



తడిచెత్త-పొడిచెత్తపై అవగాహన కల్పిస్తున్న సుశీలాదేవి

రెండు ట్యాంకర్ల మధ్య ఇరుక్కుని డ్రైవర్ మృతి



మృతిచెందిన సౌందర్‌రాజన్

చంద్రగిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : రెండు ట్యాంకర్ల మధ్య ఇరుక్కుని డ్రైవర్ మృతిచెందిన ఘటన మండలంలోని కాశిపెంట్ల హెరిటేజ్ ఫ్యాక్టరీ వద్ద శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తవణంపల్లె మండలం మారేడుపల్లెకు చెందిన సౌందర్‌రాజన్(43), చంద్రగిరి మండలం ఎగువ కాశిపెంట్లకు చెందిన అశోక్ హెరిటేజ్ ఫ్యాక్టరీలో పాల ట్యాంకర్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో అశోక్ ఫ్యాక్టరీలో పాల లోడ్డును దింపేసి, ఫ్యాక్టరీ బయట ట్యాంకర్‌ను పార్క్ చేసి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో సౌందర్‌రాజన్ తన ట్యాంకర్‌ను పార్కింగ్‌లో పెట్టి, దిగుతున్న క్రమంలో ట్యాంకర్ ముందుకు కదిలింది. దీంతో రెండు ట్యాంకర్ల మధ్యలో ఇరుక్కుపోయి మృతి చెందాడు. ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో స్థానికులు గుర్తించి, చంద్రగిరి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

- రూ.20 లక్షల ఆస్తి నష్టం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): త్యాగరాజనగర్‌లో శనివారం తెల్లవారుజామున విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. దాదాపు రూ.20 లక్షల ఆస్తి బుగ్గిపాలైంది. బాధితుల కథనం మేరకు... శ్రీనివాసతేజ రెసిడెన్సీలో ఐదవ అంతస్తులో రామమోహన్‌రావు కుటుంబం ఉంటోంది. శనివారం తెల్లవారుజామున బెడ్‌రూము ఏసీలో విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో మంటలు రావడం ఆయన గమనించారు. అప్రమత్తమై వెంటనే కుటుంబ సభ్యులను బయటకు పంపారు. అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. అయితే ఆ శాఖ సిబ్బంది సకాలంలో చేరుకోలేదు. దీంతో మంటలు ఎగసి సామగ్రి కాస్తా అగ్నికి ఆహుతయింది. అగ్నిమాపక యంత్రం వచ్చే సరికి నష్టం జరిగిపోయింది. దాదాపు రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని యజమాని తెలిపారు. ఈ ఘటనలో పక్క ఫ్లాట్‌వారికి కూడా కొంతనష్టం వాటిల్లింది.

చెత్త పన్ను నుంచి విముక్తి

- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ నోటిఫికేషన్

చిత్తూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన చెత్త పన్ను నుంచి ప్రజలకు విముక్తి లభించింది. గతేడాది డిసెంబరు 31 నుంచి చెత్త పన్ను రద్దు అమల్లోకి వచ్చినట్లుగా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలో సుమారు రూ.1.10 కోట్ల చెత్త పన్నును వైసీపీ అప్పట్లో వసూలు చేసిన విషయం తెలిసిందే. చెత్త పన్ను వసూళ్లను నిలిపివేస్తూ 2024 డిసెంబరులో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన మున్సిపల్ చట్ట సవరణను అసెంబ్లీ ఆమోదించింది. దానికి గవర్నర్ అనుమతితో ఇటీవలే గెజిట్ విడుదలైంది. తాజాగా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ నోటిఫికేషన్ ఇచ్చింది.వైసీపీ ప్రభుత్వం 2021 నవంబరులో ఈ చెత్త పన్ను ను అమలులోకి తెచ్చింది.2022 జూలై నుంచి మున్సిపాలిటీల్లో ఎంపిక చేసిన వార్డుల్లో పన్ను వసూలుకు శ్రీకారం చుట్టారు.చిత్తూరులోని 11 డివిజన్లలో రూ.70 లక్షల చెత్త పన్ను వసూలు చేశారు. పుంగనూరు నుంచి రూ.21 లక్షలు, పలమనేరులో రూ.12 లక్షలు, నగరి మున్సిపాలిటీ నుంచి రూ.8 లక్షల్ని వసూలు చేశారు. మొత్తంగా జిల్లాలో పట్టణ ప్రాంతాల ప్రజల ముక్కు పిండి మరీ రూ.1.10 కోట్లను వసూలు చేయగలిగారు.మళ్లీ వైసీపీ అధికారంలోకి వచ్చి ఉంటే మిగిలిన డివిజన్లలో కూడా పన్ను వసూలు చేసేది. కూటమి ప్రభుత్వం రావడం, చంద్రబాబు ఎన్నికల హామీని నిలబెట్టుకోవడంతో పట్టణ ప్రజలకు పన్ను విషయంలో ఊరట లభించింది.



మాట్లాడుతున్న డీఈవో కేవీఎన్ కుమార్

భవితలో పిల్లల భవిష్యత్తు మారాలి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాలకు వచ్చే ప్రత్యేక అవసరాలు గల పిల్లల భవిష్యత్తును ప్రగతిపథం దిశగా నడిపించాలని డీఈవో కేవీఎన్ కుమార్ అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి ఐఈఆర్‌టీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి భవిత కేంద్రంలో పిల్లల నమోదును పెంచాలన్నారు. వారిని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ప్రతి మండలంలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లందరికీ భవిత కేంద్రాల ద్వారా అవసరమైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎంవో శివశంకరయ్య, ఏఏఎంవో మధు, ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో బయోగ్యాస్ ప్లాంట్



ప్లాంట్ కోసం కేటాయించిన స్థలం

- 40 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో మొదలైన పనులు

తిరుమల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఐఓసీఎల్ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్) బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణం పనులు మొదలయ్యాయి. రూ.12.85 కోట్లతో ఐఓసీఎల్, టీటీడీ సంయుక్తంగా ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నాయి. రోజుకు 40 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు. సాధారణంగా తిరుమలలో రోజూ తడి చెత్త 30 టన్నులు, పొడిచెత్త 40 టన్నుల వరకు సేకరించి గోగర్భం డ్యాంకు సమీపంలో ఉన్న డంప్‌యార్డ్‌కు తరలిస్తుంటారు. ఇలా వచ్చిన చెత్త ఇప్పటికే దాదాపు లక్ష మెట్రిక్ టన్నులు ఉండటం గమనార్హం. దీని తొలగింపు కోసం టీటీడీ ఇప్పటికే చర్యలు చేపట్టింది. కాగా, తడి చెత్త నుంచి బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేసే అంశంపై టీటీడీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే తిరుమలలోని కాకులమానుతిప్ప వద్ద ఐఓసీఎల్ ద్వారా బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు గతేడాది నవంబరులో శంకుస్థాపన చేశారు. ప్లాంట్ ఏర్పాటు కోసం 2.22 ఎకరాలు, కంపోస్టు నిల్వ కోసం 0.17 ఎకరాల స్థలాన్ని టీటీడీ ఇప్పటికే కేటాయించింది.

రూ.12.85 కోట్లు కేటాయింపు

ఈ ప్లాంటు నిర్మాణానికి రూ.12.85 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళిక రూపొందించారు. ఇందులో రూ.7.05 కోట్లు ఐఓసీఎల్, రూ.5.80 కోట్లను టీటీడీ సమకూర్చనుంది. ఇప్పటికే ఐఓసీఎల్ ద్వారా బెంగళూరుకు చెందిన జీపీఎస్ రెన్యూవబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ప్రాజెక్ట్ నిర్మాణ పనులను చేపట్టింది. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు. తడి చెత్త ద్వారా వచ్చే ఆహారం, అరటి ఆకులు, చెట్లవేళ్లు వంటి మిక్స్‌డ్ వ్యర్థాలతో బయోగ్యాస్‌ను తయారు చేసి, రెండున్నర కిలోమీటర్ల దూరంలోని తరిగొండ అన్నప్రసాద కేంద్రానికి పైపులైన్ ద్వారా సరఫరా చేయనున్నారు. ప్రస్తుతం టీటీడీ రోజుకు వేల కేజీల గ్యాస్‌ను వినియోగిస్తోంది. ఈ ప్లాంట్ ద్వారా తడిచెత్తను సమర్థవంతంగా తొలగించడంతోపాటు గ్యాస్ అవసరాలు కొంతలో కొంతైన తగ్గుతాయని టీటీడీ భావిస్తోంది. కాగా, ప్రస్తుతం ప్లాంట్ ఏర్పాటు చేయబోయే స్థలంలో చదును పనులు పూర్తయ్యాయి.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు: పాశం



అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అందజేసే అర్జీలకు అధికారులు సత్వరమే పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధశాఖల అధికారుల సమక్షంలో ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. వారంలో ఒక రోజు ప్రజావేదిక నిర్వహించి అధికారుల సమక్షంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నామని చెప్పారు. అనారోగ్య కారణంగా దీర్ఘకాలికంగా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వివరాలను తనకు అందజేస్తే సీఎం సహాయనిధి నుంచి సాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, విద్యుత్‌శాఖ డీఈ ప్రసాద్, నాయకులు శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు



విద్యాసంస్థల బస్సులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థలకు సంబంధించిన వాహనాలు నిబంధనలను అతిక్రమించి నడిపితే చర్యలు చేపడతామని డీఎస్పీ గీతాకుమారి హెచ్చరించారు. శనివారం స్థానిక సాధుపేట సెంటర్‌లో పోలీస్, ఆర్టీవో అధికారులు విద్యాసంస్థల బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ బస్సులకు ఎప్పటికప్పుడు ఫిట్‌మెంట్ పరీక్షలు నిర్వహించుకుని కండీషన్‌లో ఉండేలా యాజమాన్యం చూసుకోవాలన్నారు. శిక్షణ పొందిన డ్రైవర్లనే నియమించుకోవాలని, విద్యార్థులు బస్సు ఎక్కే, దిగే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తిరుపతి రావు, ఏఎంవీఐ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్వారీ పనులను అడ్డుకుంటే కేసులు: డీఎస్పీ



అరిమేనిపాడు గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు

ఓజిలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): క్వారీకి అనుమతులు ఇచ్చేశారు... ఇప్పుడు ఆపాలంటే ఎలా... గ్రామాన్ని కాపాడుకోవాలంటే అనుమతులు రాకుండా ముందుగానే చూసుకోవాలి... ఇప్పుడు అడ్డుకోవడం అక్రమం... కేసుల దాకా తెచ్చుకోవద్దు... అని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అరిమేనిపాడు గ్రామస్తులను హెచ్చరించారు. శనివారం ఓజిలి మండలం అరిమేనిపాడు గ్రామస్తులతో డీఎస్పీ సమావేశమయ్యారు. ఇక్కడ క్వారీ వద్దేవద్దంటూ గ్రామస్తులు తమ అభ్యంతరాలను డీఎస్పీకి తెలిపారు. గతంలో అభిప్రాయ సేకరణ సందర్భంగా గ్రామానికి సంబంధంలేని వ్యక్తులతో క్వారీ ఏర్పాటుకు ఎలాంటి అభ్యంతరం లేదనే ధ్రువపత్రాలను సృష్టించడం, వివిధ స్థాయిలో అధికారులు అవకతవకలకు పాల్పడిన విషయాలను వివరించారు. డీఎస్పీ మాట్లాడుతూ క్వారీ నిర్వాహకులకు అనుమతులు ఉన్నాయని, అడ్డుకోవడం సరికాదని గ్రామస్తులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐ సంగమేశ్వరరావు, ఎస్‌ఐ స్వప్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై అవగాహన

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై ఏడీఏ నాగర్జున సాగర్ అవగాహన కల్పించారు. రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో సుజాత, వీఆర్‌వో శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్



ఇళ్ల నుంచి చెత్త సేకరిస్తున్న డీఎల్‌పీవో, పంచాయతీ కార్యదర్శులు

కోట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడు పంచాయతీలో శనివారం పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు బందిలి రఘురామ్, శ్రీనివాసులు, పారిశుధ్య సిబ్బంది ఇంటింటా చెత్త సేకరించారు. చెత్త నిల్వ వల్ల నష్టాలు, అంటువ్యాధుల గురించి అధికారులు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్త వేరు చేయడం, సంపద తయారీ కేంద్రాల్లో సేంద్రియ ఎరువుల తయారీ గురించి అవగాహన కల్పించారు.

ప్రతి దుకాణం వద్ద చెత్త బుట్టలు పెట్టండి

చిట్టమూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రధాన కూడలి ప్రాంతమైన కొత్తగుంటలో ప్రతి దుకాణం వద్ద వ్యర్థాలు వేసేందుకు చెత్త బుట్టలు పెట్టాలని గూడూరు డీఎల్‌పీవో వెంకటరమణ సూచించారు. శనివారం ఇంటింటి నుంచి చెత్త సేకరణ స్పెషల్ డ్రైవ్‌లో ఆయన పాల్గొన్నారు. చిట్టమూరు, కొత్తగుంట, యల్లసిరి గ్రామాల్లో చెత్తను సేకరించారు. టిఫిన్ షాపుల్లో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నియంత్రించాలని, చికెన్, చేపల వ్యర్థాలను ఊరికి దూరంగా పడేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గూడలిలో మాఘమాస పూజలు

కోట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల శ్రీదేవి, భూదేవి సమేత జనార్ధనస్వామి ఆలయంలో శనివారం మాఘమాస చివరి శనివారం పూజలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు ఉదయగిరి ఆదిశేషాచార్యుల ఆధ్వర్యంలో జనార్ధనస్వామికి పలు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. గూడలితో పాటు పరిసర గ్రామాల ప్రజలు స్వామి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తడ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తడ, భీములవారిపాళెం సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ మురళి తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అక్కంపేట వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ సౌజన్య తెలిపారు. ఈనెల 24వ తేదీ నుంచి సీఎస్‌సీ డాట్ ఎపి డాట్‌జీవోవి డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని, వివరాలకు 9948146677 నెంబరును సంప్రదించాలని ప్రిన్సిపాల్ అన్నారు.

రైతులందరూ విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి

కోట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతూ విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని మండల వ్యవసాయ అధికారి నిరంజన్‌కుమార్ సూచించారు. మండల పరిధిలోని కేశవరం, చిట్టేడు రైతు సేవా కేంద్రాల్లో శనివారం రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యపై అవగాహన కల్పించారు. విశిష్ట గుర్తింపు సంఖ్య పొందిన రైతులకే పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, పంట నష్టపరిహారం, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్ర పరికరాలపై రాయితీల తదితర పథకాలు అందుతాయన్నారు. ఈనెల 25వ తేదీలోగా రైతు కేంద్రాల్లో విశిష్ట సంఖ్య కోసం వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.



మాచవరం, ముమ్మాయపాళెం, కోనేటిరాజుపాళెం సమీపంలో రోడ్ల దుస్థితి

భారీ వాహనాల రాకపోకలతో ఛిద్రమవుతున్న గ్రామీణ రోడ్లు

ఓజిలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో భారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్లు ఛిద్రమైపోతు న్నాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు రూపు కోల్పోయి అధ్వానంగా ఉన్నాయి. మండలంలోని పలు ప్రాంతాల్లో క్వారీల నుంచి నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌తో పాటు ఇతర ప్రాంతాలకు గ్రావెల్, మెటల్ తరలింపు గ్రామీణ రోడ్ల మీదుగానే సాగుతోంది. కేవలం తేలికపాటి వాహనాలు, బస్సుల కోసం వేసిన రోడ్లలో సామర్థ్యానికి మించి బరువుతో వెళుతున్న భారీ వాహనాలతో రోడ్లు రూపుకోల్పోతున్నాయి. మండంలోని అరిమేనిపాడు రెవెన్యూ పరిధిలోని రజానగరం నుంచి నాయుడుపేట మండలం కోనేటిరాజుపాళెం వరకు ఉన్న పది కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా రూపు కోల్పోయింది. రజానగరం నుంచి తిరుమలపూడి, మాచవరం, ముమ్మాయపాళెం గ్రామాల వద్ద అడుగడుగున గోతులు తేలాయి. ముమ్మాయపాళెం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలోని కోనేటిరాజుపాళెం రోడ్డు కూడా ఛిద్రమైపోయింది. ఈ మార్గంలో నిత్యం భారీ వాహనాల రాకపోకలు కొనసాగుతున్న కారణంగా రోడ్లు ఇలా మారాయి. రజానగరం నుంచి కోనేటిరాజుపాళెం వరకు ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ మార్గంలో ద్విచక్రవాహన చోదకులతో పాటు కార్లు, ఆటోలు తిరగాలంటే హడలిపోతున్నారు. ద్విచక్ర వాహన చోదకులు అదుపుతప్పి ప్రమాదాలకు గురౌతున్నారు. ఆటోల్లో ప్రయాణం నరకాన్ని తలపిస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గ్రామీణ రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వాస్పత్రిలో వైద్య సేవలు: విజయశ్రీ



సమావేశంలో వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన హెచ్‌డీసీ కమిటీ సభ్యులు సతీష్, సరిత, హనుమంతరావు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిలో కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని హెచ్‌డీఎస్ కమిటీ చైర్ పర్సన్ ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం ఆస్పత్రిలో హెచ్‌డీఎస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి ప్రస్తుతం రూ.5 లక్షలు మంజూరయ్యాయని, ఆ నిధులతో విద్యుత్ మరమ్మతులు, ఎక్స్‌రే ప్లాంట్ వినియోగంలోకి తీసుకురావ డానికి ఖర్చు చేస్తామన్నారు. అలాగే నియోజకవర్గ కేంద్రమైన సూళ్లూరుపేటలో డయాలసిస్ యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. సీఎం చంద్రబాబునాయుడు పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకొంటున్నారని, అందులో నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఆస్పత్రిలో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలని సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌డీసీ కమిటీ మెంబర్లు వై.సతీష్, హనుమంతరావు, సరిత, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, మండల కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఉగ్గుముడి సర్పంచు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోటపోలూరు సర్పంచు అరుణమ్మ, వేదికపై ఎంపీపీ అనిల్‌రెడ్డి, ఎంపీడీవో మురళీకృష్ణ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయం పనిచేయాలని ఎంపీపీ అల్లూరు అనిల్‌రెడ్డి అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పలువురు సర్పంచులు గ్రామాల్లో సమస్యలపై గళం విప్పారు. కోటపోలూరు సర్పంచు కమతం అరుణమ్మ మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల గురించి సమాచారం ఇవ్వడం లేదని, అభివృద్ధి పనుల విషయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ స్పందిస్తూ గ్రామ ప్రథమ పౌరురాలైన సర్పంచికి సమాచారం ఇవ్వకపోవడం ఏమిటని పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్‌ని ప్రశ్నించారు. గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు గురించి సర్పంచులు, ఎంపీటీసీలకు తప్పకుండా సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే సమస్యలు పరిష్కారమవుతుందన్నారు. తీరప్రాంత గ్రామాలైన కొరిడి, దామరాయి, కడపట్ర పంచాయతీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని, దీనివల్ల తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు కోరారు. ఎంపీపీ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో వుంచుకొని గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. ఆయా పంచాతీయల్లో సర్పంచుల ద్వారా ముందస్తుగా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మురళీకృష్ణ, డీటీ సంధ్య, విద్యుత్‌శాఖ ఏఈ పూర్ణిమ, ఏపీఎం ప్రసన్న, ఏపీవో నాగరాజు, గృహనిర్మాణ శాఖ ఏఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వరస్వామి ఆలయంలో 24 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని గంగా పార్వతీ త్రినేత్ర సంభూతుడైన నాగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 24 నుంచి మార్చి 1 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఆహ్వాన ప్రతులను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మమత, ఉత్సవ కమిటీ సభ్యులు ముప్పాళ్ల శ్రీహరిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, చెన్నం శ్రీనివాసులు, ఎన్.రాము, పి.రాజశేఖర్, ఎం.శాంతి, చెంగాళమ్మ ఆలయ మాజీ చైర్మన్ ముప్పాళ్ల వెంకటేశ్వర్లురెడ్డి, టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, రమేష్, కిషోర్, మాధవ నాయుడు పాల్గొన్నారు.

మూర్ మార్కెట్ కాంప్లెక్స్ - నెల్లూరు మెమూ రైళ్ల రద్దు

పెరంబూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని మూర్ మార్కెట్ కాంప్లెక్స్ - సూళ్లూరుపేట - నెల్లూరు మెమూ రైళ్లను ఈ నెల 24, 27, మార్చి 1వ తేదీల్లో రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే పేర్కొంది. చెన్నై సెంట్రల్ - గూడూరు సెక్షన్‌లోని పెదపరియ - నాయుడుపేట మధ్య రైలు మార్గంలో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా కొన్ని మెమూ రైళ్లు రద్దు చేశారు. ఆ ప్రకారం, మూర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 5.40, సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు ఉదయం 8.10 గంటలకు వెళ్లే మెమూ రైళ్లను రద్దు చేశారు. అలాగే, నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10.20, సూళ్లూరుపేట నుంచి మూర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 12.35 గంటలకు వెళ్లే మెమూ రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే వార్డుబాట

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే వార్డుబాట కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని సాయినగర్, చినసత్రంలో పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకొన్నారు. తాగునీరు సక్రమంగా రావడం లేదని, సాయినగర్ నుంచి చిన్నసత్రం ప్రధాన రహదారి సరిగా లేదని స్థానికులు చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కరించడంతో పాటు సిమెంటు రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పచ్చవ మాధవనాయుడు, చెంగాళమ్మ ఆలయ మాజీ చైర్మన్ ముప్పాళ్ల వెంకటేశ్వర్లు రెడ్డి, పాముూరు మునస్వామి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన నాయుడుపేట పట్టణంలోని అగ్రహార పేటలో వెలుగుచూసింది. బాధితురాలి కథనం మేరకు... అగ్రహార పేటలో నివాసం ఉంటున్న ఓ మహిళ శుక్రవారం ఉదయం తన కుమార్తెను నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొని వెళ్లింది. ఆ తరువాత వృద్ధురాలైన ఆమె తల్లి బయటకు వెళ్లేందుకు పక్కింట్లో వాళ్ల తాళం తీసుకొని వచ్చి తమ ఇంటికి వేసి వెళ్లింది. కొంత సమయం తరువాత వృద్ధురాలు వచ్చి తాళాలు తీసి ఇంట్లోకి వెళ్లింది. అదే సమయంలో నెల్లూరుకు వెళ్లిన కుమార్తె కూడా ఇంటికి చేరుకున్నారు. శనివారం ఉదయం సిలిండర్ తీసుకొనేందుకు నగదు కోసం ఇంట్లో భద్రపరిచిన సంచె తీసి చూడగా అందులో ఉన్న నాలుగు సవర్ల బంగారు ఆభరణాలు, రూ.5వేల నగదు కనిపించలేదు. చోరీకి గురైనట్లు గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

చిట్టమూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని టాస్క్‌ఫోర్స్ జిల్లా అధికారి శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆరూరులోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన పరిశీలించారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న ఎన్‌సీడీ, సీడీ సర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి పద్మావతి, ఎస్‌వో నాగేంద్రకుమార్, నరేష్, ప్రకాష్, బాబూరావు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత

గూడూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సినీనటి గీతాసింగ్ అన్నారు. శనివారం స్థానిక వివేకానంద పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుంచే చదువులపై శ్రద్ధ చూపాలని, ఇష్టపడి చదివితే విజయాలను సాధించవచ్చన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ లక్ష్యాలను ఎంచుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలకు ప్రభుత్వ ప్రోత్సాహం

వాకాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల పరిసరాల్లో మురుగునీటి సమస్య లేకుండా ఉండేందుకు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని డ్వామా పీడీ శ్రీనివాస్‌ప్రసాద్ అన్నారు. మండలంలోని వాకాడు బీసీ కాలనీ వద్ద శనివారం ఇంకుడు గుంతల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఇంకుడు గుంతలు నిర్మాణానికి ప్రభుత్వం రూ.6,500 అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో విజయమ్మ పాల్గొన్నారు.



ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాస్‌ప్రసాద్

మహిళ ఆత్మహత్య

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నమేడు గ్రామంలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. కుటుంబకలహాలతో శనివారం ఇంటి సమీపంలో పొలాల వద్ద బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు.

పది వేల ఇళ్ల మంజూరుకు కృషి

దొరవారిసత్రం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పదివేల మంది పేదలకు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసేలా అధికార యంత్రాంగం పనిచేయాలని ఎమ్మెల్యే విజయశ్రీ కోరారు. దొరవారి సత్రం మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సంబంధించిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఆరువేల మంది ఇళ్ల మంజూరు కోసం నమోదు చేసుకొన్నారని, ఈ సంఖ్య పది వేలకు చేరేలా అధికారులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్లు శైలాకుమారి, రాజేంద్ర, నరసింహ, ఎంపీడీవోలు గోవర్ధన్, ప్రమీలారాణి, విజయ్ కుమార్, తడ, దొరవారిసత్రం, ఓజిలి మండలాల టీడీపీ అధ్యక్షులు మురళీరెడ్డి, శ్రీనివాసులునాయుడు, విజయ్‌కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని రోటరీ క్లబ్ పాస్ట్ గవర్నర్ మునిగిరీష్ అన్నారు. శనివారం స్థానిక వీఎస్‌ఆర్ పాఠశాలలో క్రీడా పోటీలు నిర్వహించి విద్యార్థులు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం పెరిగి ఆరోగ్యంగా ఉండడంతో పాటు ఒత్తిడిని అధిగమించి, మానసికంగా ఉల్లాసం ఉంటామన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో సాధన చేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో బాలకృష్ణంరాజు, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్‌ను రద్దు చేయొద్దు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఆప్కాస్‌ను రద్దు చేయొద్దని సీఐటీయూ తిరుపతి జిల్లా అధ్యక్షుడు వడ్డిపల్లి చెంగయ్య అన్నారు. శనివారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేసి కాంట్రాక్టు వ్యవస్థను తీసుకురావాలని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయించడం సరికాదన్నారు. ఆప్కాస్ పరిధిలోని కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమే ఈనెల 28న ఆర్డీవోలకు, మార్చి 1న కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, పెంచలయ్య, సుబ్రహ్మణ్యం, రమణయ్య, హరిబాబు, ఇందరమ్మ, శుభరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కబడ్డీ పోటీలు

చిల్లకూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మళదిబ్బ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు శనివారం అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు దోహద పడుతాయన్నారు. విజేత, రన్నరప్ జట్లుకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కౌశల్‌సింగ్, శ్రీకాంత్, జగదీష్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న డీఎస్పీ గీతాకుమారి

చిల్లకూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చునని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. శనివారం మండలంలోని తిక్కవరం ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పీపుల్ వెల్ఫేర్ అండర్ ఛైల్డ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యాసామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుల ద్వారానే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ పోతుగుంట మల్లికార్జున్‌రావు, హెచ్‌ఎం సునీల్‌కుమార్, చిల్లకూరు అరుణ్‌బాబు, యేసుదాసు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు అవకాశాల పరిశీలన

తడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తడ నుంచి శ్రీకాళహస్తికి వెళ్లే రోడ్డును నాలుగు లేన్‌ల రహదారిగా మార్చేందుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నామని తుడా సీపీవో దేవీకుమారి తెలిపారు. శనివారం తడకు వచ్చిన ఆమె శ్రీకాళహస్తి రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీవో మాట్లాడుతూ తడ నుంచి వరదయపాళెం మండలం కదూరు క్రాస్ రోడ్డు వరకు రోడ్డును విస్తరించేందుకు వీలుందన్నారు. తుది అంచనాలు రూపొందించి కలెక్టర్‌కు అందజేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్‌అండ్‌బీ డీఈ రాంబాబు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై పార్కింగ్ చేస్తే చర్యలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో హోలి క్రాస్ కూడలి సమీపంలో జాతీయ రహదారిపై వాహనాలను పార్కింగ్ చేసే చర్యలు తీసుకుంటామని సీఐ మురళీకృష్ణ అన్నారు. హోలి క్రాస్ ప్రధాన కూడలి కావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ట్రాఫిక్ సమస్యను దృష్టిలో వుంచుకొని, కేటాయించిన ప్రదేశాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు. నిబంధనలను పాటించకపోతే రూ.1000 జరిమానా విధిస్తామన్నారు.

మంత్రి నాదెండ్లను కలిసిన జనసేన నేతలు



చిట్టమూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను శనివారం నెల్లూరులో చిట్టమూరు మండల జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన కార్యనిర్వాహణ కమిటీ సభ్యుడు బసవనూరు భాస్కర్ ఆధ్వర్యంలో నాయకులు ఆత్మకూరు పర్యటనకు విచ్చేసిన మంత్రిని కలిసి చిట్టమూరు మండలంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.